నవతెలంగాణ 1
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
మంగళవారం 04 జులై 2023

గృహ నిర్మాణాల పేరుతో రూ.2 కోట్లకు టోకరా



నవతెలంగాణ-దుబ్బాక

నూతన గృహ నిర్మాణాలు కట్టిస్తానంటూ పలువురి వద్ద ఓ వ్యక్తి రూ.2 కోట్లు వసూలు చేసి పరారైన ఘటన దుబ్బాక పురపాలిక కేంద్రంలో సోమవారం జరిగింది. దుబ్బాక ఎస్ఐ బత్తుల మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా పామూరు మండలం బొట్ల గూడూరు గ్రామానికి చెందిన 'పిక్కిలి ప్రసాద్' అనే వ్యక్తి దుబ్బాక పట్టణంలో గత కొన్ని సంవత్సరాలుగా నూతన గృహ నిర్మాణాలు చేపడుతుండేవాడు. ఈ క్రమంలో దాదాపు 30 మంది బాధితుల వద్ద ఇంటి నిర్మాణాల కోసం రూ.2 కోట్లు వసూలు చేశాడు. గత కొద్దిరోజులుగా ఇంటి నిర్మాణాలను మధ్యలోనే ఆపివేశాడు. ఆదివారం అర్ధరాత్రి కుటుంబంతో సహా పరారయ్యాడు. విషయం తెలుసుకున్న బాధితులు లబోదిబోమంటూ దుబ్బాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.నిందితునిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ మహేందర్ తెలిపారు.

ఎల్గోయి సతీష్ కుమార్‌కు వైశ్య లైమ్ లైట్ అవార్డు



నవతెలంగాణ-సదాశివపేట

సదాశివపేట్ పట్టణానికి చెందిన ఇండ్ యుగ్ ఆయిల్స్ అధినేత ఎల్గోయి సతీష్ కుమార్‌కు కుల సంఘం ప్రముఖులతో అందించే అత్యంత ప్రతిష్టాత్మక వైశ్య లైమ్ లైట్ అవార్డు దక్కింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో వైశ్యుల్లో ఎక్కువ ప్రజాదరణ పొందిన పురుషుడు (మోస్ట్ పాపులర్ వైశ్య మెన్) విభాగంలో ఆన్లైన్ ఓటింగ్ ద్వారా నిర్వహించగా ఆంధ్ర తెలంగాణ నుంచి 72 మంది నామినేట్ అయ్యారు. వారిలో ఎలుగోయి సతీష్ కుమార్ కు 6003 ఓట్లు సాధించి ఆరవ స్థానాన్ని పొందాడు. శనివారం రాత్రి హైదరా బాద్ ఫిలింనగర్ జేఆర్‌సి కన్వెన్షన్‌లో నిర్వహించిన వైశ్య లైమ్‌లైట్ అవార్డ్ ప్రధానోత్సవ కార్యక్రమంలో ఈ అవార్డును సతీష్ అందుకున్నారు. కాగా ఆయన్ను వైశ్య ప్రముఖులు విబిజీ ఫౌండర్ మడిపడి రాజు, ప్రసాద్, జీవీబీఎల్ సీఈవో మంచి రాజశేఖర్, మలక్‌పేట్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వనపర్తి రమేష్, ఓల్డ్ మలక్ పేట్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గార్లపాటి ప్రభాకర్ గుప్తా అభినందించారు.



బీఎంఎస్ నుంచి సీఐటీయూలోకి చేరికలు

నవతెలంగాణ-పటాన్‌చెరు

బీఎంఎస్‌లోకి వెళ్లిన కొందరు కార్మికులు ఆ సంఘంపై విశ్వాసం లేక సొంతగూటికి చేరుకున్నారని సీఐటీ యూ జిల్లా అధ్యక్షులు బీరం మల్లేశం, యూనియన్ అధ్యక్షులు కే రాజయ్యలు అన్నారు. సోమవారం పాశ మైలారం లోని పార్లే ఆగ్రో పరిశ్రమకు చెందిన బి ఎం ఎస్ కార్యకర్తలు సిఐటియులో చేరారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మల్లేశం మాట్లాడుతూ.. వారం రోజుల క్రితమే సీఐటీయూ నుంచి వెళ్లిన కార్యకర్తలు తిరిగి సొంతగూటికి రావటం శుభసూచకమన్నారు. బిఎంఎస్ సిద్ధాంతాలు, పని విధానము నచ్చలే దని పలువురు కార్మికులు వ్యాఖ్యానించటం గమనార్హమన్నారు. సీఐటీయూ నిరం తరం కార్మికుల కోసం పోరాడుతుందని, హక్కులు, సౌకర్యాలు సాధించిందన్నారు. ఈ పరిశ్రమలో రెండు వేతన ఒప్పందాలు జయప్రదంగా సాధించామని చెప్పారు. అంతేకాకుండా అనేక హక్కులు, సౌకర్యాలు సాధించడం జరిగిందని తెలిపారు. బిఎంఎస్ మాటలు చెప్తుంది తప్పా చేతలేవని విమర్శించారు. కార్మికులకు మాయమాటలు చెప్పి బోల్తా కొట్టించిందని వారి నిజస్వరూపం వారం రోజులనే తెలిసిందన్నారు. సంవత్సరం పైనుంచి కొంత మందికి అనేక సౌకర్యాలు కల్పిస్తా మని, జీతాల పెంచుతామని లేబర్ కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రేడ్ యూనియన్ ఎలా నడపలో బిఎంఎస్ కు తెలవదని వారనా న్నరు. స్టాఫ్ మరియు కార్మికులను మిక్స్‌డ్ చేసి ఆటలాడుతుందని విమ ర్శించారు. బిఎంఎస్‌కు ఏమి తెలవదని కార్మికులను మోసం చేయడమే తెలుసు అని అన్నారు. భవిష్యత్తులో ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జనరల్ సెక్రటరీ సంతోష్ కుమార్ గౌడ్, జంగయ్య, సుజిత్, రాజు, సుధాకర్, సీఐటీయూలో చేరిన వారిల్లో జాంగిర్ గౌడ్, పెంటయ్య, నాయుడు, మేఘరాజు ,ప్రభు, సతీష్ తదితరులు ఉన్నారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

నారాయణ రెసిడెన్షియల్ కళాశాలలో ఘటన

గోప్యత పాటిస్తున్న కళాశాల యజమాన్యం



నవతెలంగాణ-పటాన్‌చెరు

బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాటి సమీపంలో ఉన్న నారాయణ రెసిడెన్షియల్ క్యాంపస్‌లో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య ప్రయత్నం చేశాడు. బాధితుడిని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించన కళాశాల యాజమాన్యం.. ఘటనను గోప్యంగా ఉంచుతున్నది. వివరాల్లోకి వెళ్తే..

ప్రకాశం జిల్లా సింగూరు కొండకు చెందిన ఇంటర్ చదువుతున్న రామ్ ప్రణీత్ (17) సెలవులకు ఇంటికి వెళ్లగా.. తల్లిదండ్రులు అతన్ని తిరిగి హాస్టల్లో వదిలి వెళ్లారు. హాస్టల్లో ఉండటం ఇష్టం లేని ప్రణీత్ తల్లిదండ్రుల వద్ద మారాం చేసినా.. వాళ్ళు వినకుండా హాస్టల్ వద్ద విడిచిపెట్టి వెళ్లిపోయారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై సోమవారం హాస్టల్ క్యాంపస్ రెండో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో అతనికి రెండు కాళ్లు విరగ డంతో వెంటనే అతనిని హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇంత జరిగినా కళాశాల యజమాన్యం మాత్రం నిమ్మకు నీరు ఎత్తి నట్లు వ్యవహరిస్తూ.. గోప్యత పాటించడంలో అంతర్యం ఏమున్నదని పలువురు ప్రశ్నిస్తున్నారు. కాగా జరిగిన ఘటనపై బిడిఎల్ పోలీసులను వివరాలు అడగగా.. తమకు ఇంతవరకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

సూచిక బోర్డును ఢీకొట్టిన కారు.. మహిళ మృతి

నవతెలంగాణ-మునిపల్లి



కారు అదుపుతప్పి సూచిక బోర్డును ఢీకొట్టడంతో.. ఓ మహిళ మృతి చెంది ంది. ఈ ఘటన మునిపల్లి మండలం లింగంపల్లి గ్రామ శివారులో ఆదివారం ఉదయం జరిగింది. మునిపల్లి ఎస్సై చల్లా రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లాకు చెందిన సాయి వరుణ్ తన తల్లి కల్పన, మేనమామ గణేష్, మేనత్త సుజాతలతో కలిసి శనివారం కర్ణాటకలోని గంగాపూర్ దేవాలయానికి దైవదర్శనం నిమిత్తం వెళ్లారు. అయితే ఆదివారం ఉదయం తిరుగు ప్రయాణమవ్వగా.. మేనమామ గణేష్ వాహనాన్ని నడుపుతున్నాడు. ఈ క్రమంలో లింగంపల్లి శివారులోకి రాగానే కారు అదుపుతప్పి సూచిక బోర్డును ఢీకొట్టింది. వెంటనే పల్టీలు కొట్టిన కారు పక్కనే ఉన్న గుంతలో పడిపోయింది. ఈ ప్రమాదంలో సాయి వరుణ్ తల్లి కల్పనకు తీవ్ర గాయాలవ్వగా చికిత్స నిమిత్తం సంగారెడ్డి తరలించారు. చికిత్స పొందుతున్న ఆమె ఆదివారం సాయంత్రం మృతి చెందింది. కారులో ప్రయాణిస్తున్న సాయి వరుణ్, సుజాతలకు తీవ్ర గాయాలయ్యాయి. మృతురాలి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

బాసర ట్రిబుల్ ఐటీకి అక్సాన్‌పల్లి విద్యార్థి ఎంపిక



నవతెలంగాణ-జోగిపేట

బాసరలోని ట్రిబుల్ ఐటీకి మండల పరిధిలోని అక్సాన్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి జి. సంధ్య ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెంచల య్య తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బాసర ట్రిబుల్ ఐటీకి తమ పాఠశాల విద్యార్థి ఎంపిక కావడం పట్ల.. విద్యార్థిని అభినందించారు.

గుంతల రోడ్డుకు మరమ్మత్తులు

నవతెలంగాణ-వట్‌పల్లి



మండలంలోని ప్రధాన రహదారి అల్లాదుర్గం డాగ్ బంగ్లా నుంచి జహీరాబాద్, బీదర్, రాయిపల్లి, రాయికోడు మండల సిరూర్ బ్రిడ్జి నుంచి రోడ్డు గుంతల మయంగా మారి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. ఇటీవలే రెండు లారీలు సైతం గుంతల్లో ఇరుక్కుని గంటల కొద్ది ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో సంబంధిత అధికారులు వెంటనే స్పందించి.. డాగ్ బంగ్లా నుండి రాయిపల్లి వరకు గుంతల రోడ్లపై మొరం, కంకర వేసి రూల ర్‌తో తొక్కించడం ప్రారంభించారు. అదేవిధంగా రాయిపల్లి నుండి మహీబత్ పూర్ వరకు గుంతలను పూడ్చేందుకు పనులు చేస్తున్నారు. సిరూర్ బ్రిడ్జి వద్ద సిరూరు వైపు వెళుతుండగా రోడ్డు ఒకవైపు దిగిపోవడంతో రెడ్ జోన్ లోనికి మారిందన్నారు.

ఆర్టీసీ బస్సు ఏర్పాటు హర్షణీయం

నవతెలంగాణ-పుల్కల్



సమయానికి బస్సులు, ఆటోలు లేక గ్రామానికి వెళ్లడానికి తీవ్ర ఇబ్బం దులు పడిన రాయపాడు గ్రామస్తులకు ఎట్టకేలకు.. ఎమ్మెల్యే ఆదేశాలతో బస్సు సౌకర్యం కలిగింది. ఆత్మ కమిటీ మండలాధ్యక్షుడు యాదగిరిరెడ్డి చేతుల మీదుగా బస్సును ప్రారంభించారు. కాగా గ్రామానికి ఉదయం, సాయంత్రం రెండు వేళల్లో విద్యార్థుల చదువు నిమిత్తం బస్సు సౌకర్యం కల్పించినందుకు గ్రామస్తులు ఆర్టీసీ అధికారులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. మండల కేంద్రంలో ఉన్న ఆదర్శ పాఠశాల ఇతర జూని యర్ కళాశాల విద్యార్థులకు ఈ బస్సు సౌకర్యం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జయమ్మ నర్సింలు, బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు రాయిపాడు రాజు, పలు గ్రామాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు

ప్రజావాణికి అధికారుల గైర్హాజర్

- కలెక్టరేట్‌లో ఫిర్యాదుదారుల నిరీక్షణ
- జిల్లా వ్యాప్తంగా తరలొచ్చిన అర్జిదారులు
- మధ్యాహ్నం 12.30 తర్వాత డీఆర్‌ఓ ఒక్కరే
- దరఖాస్తుల పరిశీలనలో అధికారుల అశ్రద్ధ
- దరఖాస్తుల్లో భూ సమస్యలే అధికం

'ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తే సమస్య పరిష్కారం అవుతుందనే భరోసా ఉంది. క్షేత్ర స్థాయిలో ఫిర్యాదు చేసినా పట్టించుకోని పరిస్థితుల్లోనే ప్రజలు తమ సమస్యను ఉన్నతాధికారులకు విన్నవించుకునేందుకు ప్రజావాణికి వస్తుంటారు. అయినా కొన్ని భూ సమస్యలు పరిష్కారం కావట్లేదనే అభిప్రాయముంది. కానీ..! కలెక్టర్, అదనపు కలెక్టర్, ఇతర జిల్లా అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తే ప్రయోజనం తప్పక ఉంటుందనే నమ్మకం ప్రజల్లో ఉంది. అందుకే ప్రతి సోమవారం జనం ప్రజావాణిలో అర్జీలు పెట్టుకునేందుకు బారులు తీరుతున్నారు. ఈ సోమ వారం కూడా జనం పెద్ద ఎత్తున కలెక్టరేట్‌కు వచ్చారు. తీరా గ్రీవెన్స్ పిర్యాదులు స్వీకరించేందుకు అధికారులెవ్వరూ హాల్‌లోకి రాకపోయే సరికి జనం నిరాశ చెందారు. గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది.'



నిరీక్షిస్తున్న జనాలు..



అధికారుల్లేక ఖాళీగా కుర్చీలు..

నవతెలంగాణ-మెదక్‌ప్రాంతీయ ప్రతినిధి

ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తే తమ సమస్య తప్పకుండా పరిష్కారం అవుతుందనే ఆశతోనే జనం వివిద సమస్యలకు సంబంధించిన అర్జీలు పెట్టుకుంటున్నారు. ప్రతి సోమ వారం కలెక్టరేట్లకు వస్తున్నారు. ముఖ్యంగా ధరణి వచ్చాక ఏర్పడిన భూ సమస్యతోనే జనం అధికంగా ప్రజావాణిలో పిర్యాదు చేస్తున్నారు. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట మూడు జిల్లాల్లోనూ ఎక్కువ సమస్యలు ధరణివే ఉంటున్నాయి. ఆ తర్వాత డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇళ్ల స్థలాలు, వివిద కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి రుణాలు, పింఛన్లు, రేషన్‌కార్డుల మంజూరీ, చదువు, వైద్యం, ఆర్థిక సహాయం వంటి సమస్యలతో జనం ప్రజావాణికి వస్తున్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ఆలస్యంగా ప్రజావాణిలో దరఖాస్తుల్ని స్వీకరించారు. సాధారణంగా వందకు పైగా అర్జీలు వస్తాయి. ఈ వారం మాత్రం 33 మాత్రమే స్వీకరిం చారు. జనం వందల సంఖ్యలో వచ్చినప్పటికీ డీఆర్‌ఓ నగేష్ ఒక్కరే మధ్యాహ్నం 12.30 గంటల తర్వాత దరఖాస్తులు స్వీకరించారు. సాధారణంగా కలెక్టర్, అదనపు కలెక్టర్, డీఆర్‌ఓ, ఎఓతోపాటు అన్ని ప్రభుత్వ శాఖల ఉన్నతా ధికారులు గ్రీవెన్స్‌లో పాల్గొని జనం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. సమస్యల్ని వింటారు. అక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడడం, పరిశీలించమని రాయడం జరు గుతుంది. జూన్‌లో దశాబ్ది ఉత్సవాలు ఉండడంతో ప్రజా వాణి సరిగ్గా జరగలేదు. జులైలో మొదటి ప్రజావాణికి కూడా అధికారులు పూర్తి సమయం వెచ్చింకపోవడంతో అర్జీ పెట్టుకునేందుకు వచ్చిన వాళ్లు ఇబ్బంది పట్టారు. మరో పక్క ఇళ్ల స్థలాల సమస్యపై వందలాది మంది కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఉమ్మడి దరఖాస్తుతో పాటు వ్యక్తిగతంగా ఇళ్ల స్థలాలు, ఇళ్ల మంజూరు కోసం అర్జీలు పెట్టుకునేందుకు వచ్చారు. కొండాపూర్, సదాశివపేట, పటాన్‌చెరు, కంది, ఆందోల్ మండలాల నుంచి భూ సమస్యల్ని విన్నవిం చేందుకు జనం పెద్ద ఎత్తున వచ్చారు. కలెక్టర్, అదనపు కలెక్టర్ ఎవరో ఒకరు ఉంటే బాగుండేదని పలువురు అర్జీదారులు వాపోయారు.

నా భూమిని ఆక్రమించిన సీఐ



సర్వే నెంబర్ 1141లో 25 గుంటల భూమి మా తల్లి బండల లచ్చమ్మ పేరున ఉంది. ఆమె చనిపోం యింది. మా భూమిని నల్గొండకు చెందిన వ్యక్తి కబ్జా చేశారు. మా తల్లి పేరిట పట్టాదారు పాసు పుస్తకం ఉంది. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే వెంకయ్య అనే వ్యక్తి మా భూమిని ఆక్రమించుకున్నారు. 50 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న మా భూమిని దౌర్జన్యంగా కబ్జా చేసిన వ్యక్తి అందులోకి మేము వెళ్లితే చంపుతా నంటూ బెదిరిస్తున్నాడు. అధికారులు తమ భూమిని ఇప్పించాలని మనవి.

- బండల మాణయ్య, ఆందోల్


28 గుంటల భూమి ఎక్కలే



పాత పాస్‌పుస్తకంలో నా పేరిట సర్వే నెంబర్ 330లో 28 గుంటల భూమి ఉంది. ధరణి వచ్చాక కొత్తగా ఇచ్చిన పాస్‌బుక్‌లో అట్టి భూమిని ఎక్కించలేదు. నా భూమిని కొత్త పాస్ బుక్‌లో ఎక్కించాలని మీసేవలో దరఖాస్తు చేసుకున్నాను. చాలా సార్లు అధికారుల చుట్టు తిరిగాను. కలెక్టర్‌కు పిర్యాదు చేస్తేనైనా పరిష్కారం అవుతుందనే ఆశతో వచ్చాను. దయచేసి నా భూమి నాకు చేయగలరని మనవి.

- కుమ్మరి మొగులయ్య, మాచిరెడ్డిపల్లి

నా భూమి నాకు కావాలి



నాకు తెల్వకుండానే నా భూమిని మరొకర్కి చేశారు. నాకు సర్వే నెంబర్ 40/జీలో 10 గుంటల భూమి ఉంది. 1997లో 54/4 సర్వే నెంబర్‌లో 20 గుంటల, 180 సర్వే నెంబర్‌లో 1 ఎకరం భూమి కలిపి మొత్తం 1.20 ఎకరం భూమిని ప్రభుత్వం ఇచ్చింది. నా పేరిట నా సొంత భూమితో పాటు ప్రభుత్వం ఇచ్చింది కలిపితే 1.30 ఎకరాల భూమి పట్టా ఉంది. ధరణీ వచ్చే సమయంలో నాకు తెల్వకుండానే నా పేరిట ఉన్న భూమిని మరొకరి పేరిట మార్చారు. ప్రస్తుతం నా పేరిట సెంటు భూమి కూడా లేకుండా పోయింది. నా పేరిట ఉన్న భూమిని బేగరి సోమన్న, బేగరి రాంచందర్, బేగరి లక్ష్మీ పేరిట చేశారు. వాళ్లు ముగ్గురు కూడా గ్రామ పెద్దలు, ఆర్ఐ సమక్షంలో అట్టి భూమి వాళ్లది కాదని, బేగరి రత్నయ్యదే అని వాగ్మూలం ఇచ్చారు. కానీ..! అధికారులు మాత్రం తామేమీ చేయలేమని చేతులెత్తేస్తున్నారు.

-బేగరి రత్నయ్య, కోనాపూర్

భూమి తక్కువ ఎక్కించారు



నాకు పూర్వం ఉన్న భూమిలో కొంత తగ్గించి ఎక్కించారు. నాకు కొత్త పాస్‌బుక్‌లో సర్వే నెంబర్ 200/ఇ, 285/ఇఈ, 146లో రెండెకరాల ఆరు గుంట భూమి మాత్రమే ఎక్కించారు. మరో 30 గుంటల భూమిని నా పేరిట కాకుండా మరొకరి పేరిట మార్చారు. నా భూమిని నాకు చేయాలని ఎన్నో సార్లు దరఖాస్తు పెట్టుకున్నాను. ఈరోజు దరఖాస్తు ఇద్దామని వస్తే అధికారులు లేరు. ఎండలో వచ్చిన ఈ చెట్టుకింద కూర్చున. అధికారులు పట్టించుకోవాలి.

- కర్రె పద్మయ్య, కొల్లాపూర్

పేదలకు ఇండ్లు ఇవ్వడంలో కేంద్రం విఫలం

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు
- పేదలకు ఇండ్లు ఇవ్వకపోతే ప్రభుత్వానికి చరమ గీతం పాడుతాం
- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్



సంగారెడ్డిలో..



సిద్దిపేటలో..



మెదక్‌లో..

నవతెలంగాణ-మెదక్‌ప్రాంతీయ ప్రతినిధి, సిద్దిపేటఅర్బన్, మెదక్

పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాల సమస్యను పరిష్క రించడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని.. ప్రధాని అవాజ్ యోజన పథకం ఎక్కడ అమలు అవుతుందో అర్థం కాని పరిస్థితి ఉన్నదని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు విమర్శించారు. ఒకవేళ పేదలకు ఇండ్లు ఇవ్వకపోతే ఈ ప్రభుత్వాలకు చరమ గీతం పాడుతాం అని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్ హెచ్చరించారు. పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలి వ్వాలనే డిమాండ్‌తో సోమవారం జిల్లా కలెక్టరేట్ల ఎదుట ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఎదుట నిర్వహించిన ధర్నాలో చుక్క రాములు, సిద్దిపేట జిల్లా కార్యాలయం ఎదుటి ధర్నాలో బుర్రి ప్రసాద్, మెదక్ కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఏ.మల్లేషంలు పాల్గొని మాట్లాడారు. ప్రతి పేదవాడికి ఇల్లు నిర్మించి ఇస్తా మని ప్రకటించిన మోడీ మాటలు నీటి మూటలు అయ్యా యన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పేదలకు ఇల్లు ఇళ్ల స్థలాలు ఇస్తామని ప్రకటించినప్పటికీ తొమ్మిదేళ్ల పాలనలో ఆ సమస్యను పరిష్కరిం చలేదన్నారు. డబల్ బెడ్ రూమ్ పథ కం ఆచరణలో పెద్దగా ఫలితాలు ఇవ్వలేదన్నారు.గృహలక్ష్మి పథకం ద్వారా ఇంటి స్థలం ఉన్నా వారికి ఇస్తానన్న మూడు లక్షల సాయాన్ని ఐదు లక్షలకు పెంచాలన్నారు. ఇల్లు లేని పేదలు ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకొని నివసిస్తున్నా రన్నారు. వారి పట్ల సానుకూలంగా స్పందించి పట్టాలి ఇచ్చి ఇంటి నిర్మాణం కోసం ఆర్థిక సహాయం చేయాల్సిన ప్రభు త్వం నిర్బంధాన్ని కొనసాగిస్తున్నదని విమర్శించారు. పేదల తరపున పోరాడుతున్న ప్రజాసంఘాలు నాయకులను అరెస్టు చేయడం కేసులు పెట్టడం పేదల గుడిసెలను కూల్చి వేయడం అనేది ప్రజాస్వామ్యన్నారు. పేదల ఇళ్ల స్థలాలు ఇంటి నిర్మాణ సమస్యను ప్రాధాన్యత గుర్తించకపోవడం రాజ్యాంగ ఉల్లంఘన అవుతుంది అన్నారు ఉండడానికి నివాసం తినడానికి తిండి చేయడానికి పని కల్పించడం అనేది ప్రభుత్వాల కనీస బాధ్యత అని అది రాజ్యాంగం లో పేర్కొనబడిందని విషయం విస్మరించకూడదని పేర్కొన్నారు ఇళ్లస్థలాలు ఇవ్వని పక్షంలో పేదలు మరింత తీవ్రతరంగా ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమాల్లో సంగారెడ్డిలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె. మల్లికార్జున్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయ రాజ్, కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్, సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మల్లేశం, సాయిలు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రాజయ్య, ప్రవీణ్, నాయిని నరసింహా రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి ఎం యాదగిరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం. నరసింహులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కే రాజయ్య, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు శివకుమార్ జిల్లా కమిటీ సభ్యులు దాస్, మహేష్,కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రమేష్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అర్షద్ పాల్గొన్నారు.

సిద్దిపేటలో ధర్నా కార్యక్రమం చొప్పరి రవికుమార్ అధ్యక్షతన జరగగా.. పాల్గొన్న వారిలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు దాసరి కళావతి, రైతు సంఘం శెట్టిపల్లి సత్తిరెడ్డి, జిల్లా కార్యదర్శి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొంగర వెంకట్ మావో, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సింగిరెడ్డి నవీన, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సనాది భాస్కర్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల నవీన్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కొండం సంజు, సీఐటీయూ కోశాధి కారిగొడ్డు బర్ల భాస్కర్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు బాలకిషన్, ఏబీపీ ఎస్‌ఓ జిల్లా కార్యదర్శి జాలిగాపు శిరీష,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాం సార్ సర్పంచ్ తాడూరి రవీందర్ స్నేహ ఇంటి పని వారల సంఘం జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి, నాయకులు అనిత, లక్ష్మి ఉన్నారు.

మెదక్‌లో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బసవరాజ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం, ఆవాజ్ జిల్లా కన్వీనర్ మొహినుద్దీన్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లచ్చగౌడ్, సిఐటియు కోశాధికారి నర్సమ్మ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన రాజేశ్వరరావు దేశ్ పాండే

నవతెలంగాణ-సంగారెడ్డి

బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు పార్లమెంటరీ బోర్డు సభ్యులు డా. కే. లక్ష్మణ్‌ని ఆయన నివాసంలో సంగారెడ్డి బీజేపీ అసెంబ్లీ ఇంచార్జ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి.. జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు పార్టీ సీనియర్ నాయకులు అనంతరావు కులకర్ణి, బిజెపి సంగారెడ్డి కౌన్సిలర్ మందుల నాగరాజు, బీజేపీ సంగారెడ్డి జిల్లా మీడియా ఇంచార్జ్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజల దాహార్తి తీర్చిన భాస్కర్‌గౌడ్‌కు సన్మానం

నవతెలంగాణ-సదాశివపేట

సదాశివపేట బస్టాండ్‌లో వేసవికాలంలో ప్రయాణికుల దాహార్తి తీర్చడానికి శ్రీ భాస్కర్ గౌడ్ 4 నెలలు ప్రయాణికులకు తాగడానికి మంచినీరు అందించాడు. ప్రయాణికులకు ఇంత సేవ చేసినందుకుగాను సంగారెడ్డి డిపో మేనేజర్ ఉపేంద్ర భాస్కర్‌గౌడ్‌ను శాలువా పూల దండలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సదాశివపేట బస్టాండ్ కంట్రోలర్ బి.ప్రకాష్, బొంతప్ప బస్‌పాస్ కౌంటర్ శివకుమార్ పాల్గొన్నారు.



బీటీరోడ్లు మంజూరు చేయాలని జోనల్ కమిషనర్‌కు వినతి

నవతెలంగాణ-రామచంద్రాపురం

శేరిలింగంపల్లిలోని జోనల్ కార్యాలయంలో సోమవారం జోనల్ కమిషనర్ శంకరయ్యను కలిసి బి.డి.ఎల్ అపార్ట్మెంట్‌లో బీటీరోడ్లు మంజూరు చేయాలని భారతి నగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శ రెడ్డి వినతి పత్రం అందజేశారు. కమిషనర్ వాటిని వెంటనే మంజూరు చేశారు. అలాగే ఇదివరకే మంజూరైన ఎం.ఐ.జి కాలనీ బి పార్క్ కాంపౌండ్ వాల్, అన్నమయ్య కాలనీ లో కాంపౌండ్ వాల్ మరియు ఓపెన్ డ్రైన్ పనులు త్వరగా టెండర్ వేసి ప్రారంభించాలని కార్పొరేటర్ విజ్ఞప్తి చేశారు. కార్పొరేటర్‌తో పాటు ఆమె భర్త బీఆర్ఎస్ నాయకులు ఆదర్శ్ రెడ్డి పాల్గొన్నారు.

పోడు పట్టాలను పంపిణీకి సిద్ధం చేయాలి

- లక్ష రూపాయల సాయం ధరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

జిల్లాలో గుర్తించిన లబ్ధిదారులకు పోడు పట్టాలను పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లను చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాల యంలో కలెక్టర్ శరత్ వివిధ అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పోడు పట్టాల పంపిణీకి సిద్ధం చేయాలని సూచించారు. లబ్ధిదారులకు సంబంధించిన పట్టాదారు పాస్ బుక్స్ మంత్రి చేతుల మీదుగా అందజే యనున్నట్లు తెలిపారు. లబ్ధిదారులకు పట్టాలు అందిం చడం మొదలుకొని కార్యక్రమం విజయ వంతంగా పూర్తి అయ్యేలా ప్రణాళికతో ఏర్పాట్లు చేసుకో వాలన్నారు. గృహలక్ష్మి పథకం కింద ప్రభుత్వం జారీ చేసిన నిబంధనల మేరకు పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరగాలన్నారు. ఈ పథకంలో ఒక్కో లబ్ది దారుకు 3 లక్షలు ఇస్తారని, వంద శాతం సబ్సిడీ లభిస్తుందన్నారు. అర్హులైన కుటుంబంలోని మహిళల పేరుపై గృహలక్ష్మి ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఇల్లు లేని నిరుపేదలు ఈ పథకానికి అర్హులన్నారు. అర్హుల నుండి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. బీసీలకు లక్ష రూపాయల ఆర్థిక సాయంకు ధరఖాస్తుల ఆన్లైన్ పరిశీలన వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారికి తెలిపారు. హరితహారం జిల్లా టార్గెట్‌ను ఆయా శాఖలకు కేటాయించిన లక్ష్యం మేరకు పూర్తి చేయాలని సూచించారు. రెండవ విడత గొర్రెల పంపిణీ త్వరిత గతిన పూర్తి చేయాలని తెలిపారు. కస్టం మిల్లింగ్ రైస్ వేగవంతంగా ఎఫ్‌సిఐకి డెలివరీ చేసేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారికి సూచించారు. మన ఊరు మన బడి కింద చేపట్టిన పాఠశాలల పనులను త్వరగా పూర్తి చేయాలని సంబందితులకు సూచించారు. రెండో విడత దళిత బంధు పథకంలో లబ్ధిదారులను గుర్తించాలని, ఆయా ప్రక్రియ వేగవంతం చేయాలని, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులను నియామకం చేయాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీకి సూచిం చారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో గల వైకుంఠధామాలకు నీటి వసతి, విద్యుత్ సౌకర్యాన్ని వంద శాతం ఏర్పాటు చేయాలని డిపిఓ కు తెలిపారు. 647 జీపిలలో నీటి వసతి ఏర్పాటు చేశామని, 636 జిపి లలో విద్యుత్ సౌకర్యం కల్పించడం జరిగిందని,11 గ్రామ పంచాయతీలలో రెండు మూడు రోజుల్లో గా పూర్తవుతుందని డిపిఓ తెలిపారు. పి హెచ్ సి సబ్ సెంటర్ భవన నిర్మాణాలకు వంద శాతం గ్రౌండింగ్ పూర్తి కావాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డిఆర్‌డిఓ, జడ్పీ సీఈవో, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యా ,వైద్యం, పశుసంవర్ధక శాఖల జిల్లా అధికారులు, డిఆర్‌ఓ నగేష్,ఆర్డీఓ లు, తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

నాసిరకంగా రోడ్లు, డ్రయినేజీల నిర్మాణం


- కాంట్రాక్టర్లు, మున్సిపల్ అధికారుల కుమ్మక్కు
- సీపీఐ(ఎం) నాయకుల ఆరోపణ
- వెంటనే రోడ్లు పునర్నిర్మించాలని డిమాండ్

నవతెలంగాణ-అమీన్ పూర్

నాణ్యతలేని రోడ్ల డ్రైనేజీ నిర్మాణం ద్వారా చిన్నపాటి వర్షానికి కృంగిపోయి ప్రమాదానికి నిలయంగా మారిన పట్టించుకోని అధికారులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీ కార్యదర్శి నరసింహ రెడ్డి డిమాండ్ చేశారు. మల్లికార్జున హిల్స్ ఫేస్ వన్, మారుతీ నగర్ కాలనీలో కొద్దిపాటి వర్షానికి రోడ్లు, డ్రైనేజీలు కృంగిపోయి ప్రమాదంగా మారిన రోడ్లను కాలనీవాసులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లక్షల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తుంటే.. నాణ్యతలేమి నిర్మాణాలు చేపట్టినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాంట్రాక్టర్లు ,మునిసిపల్ అధికారులు కుమ్మక్కై ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని ఆరోపించా. నాణ్యత లేని పనులు చేసినా పట్టించుకోని మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. మల్లికార్జున హిల్స్ ఫేస్ వన్ ,మారుతి నగర్ మధ్యలో గల రోడ్డు డ్రైనేజీ పనులు గత రెండు మూడు నెలల క్రితం వేశారు నిన్న మొన్న కురిసిన చిన్నపాటి వర్షం మూలంగా రోడ్డు క్రింద గట్టితనం లేక చిన్నపాటి వరద రావడం వల్ల రోడ్డు కృంగిపోయిందన్నారు. గత రెండు, మూడు రోజులుగా వాహనాల రాకపోకలు బంద్ అయ్యాయన్నారు. వర్షం పడుతున్న క్రమంలో చూసి చూడనట్లుగా ఎవరైనా ప్రయాణికులు వెళితే ప్రాణానికే ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. కార్లు ఆటోలు వెళ్లలేని పరిస్థితి ఉన్నదన్నారు. వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి ఆ పనులు చేసిన కాంట్రాక్టర్ పై చర్య తీసుకోవాలని, రోడ్డుని వెంటనే పునర్నిర్మానం చేయాలని డిమాండ్ చేశారు. లేని యెడల కాలనీవాసులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు జార్జ్ కాలనీవాసులు పాండరీనాథ్, నరసింహ రావు, వెంకటేశ్వర్లు, జిలాని, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు..



నవతెలంగాణ 2
సంగారెడ్డి
మంగళవారం 04 జూలై 2023



బెస్ట్ అవైలబుల్ స్కీం కింద సీట్ల భర్తీకి ఆహ్వానం

నవతెలంగాణ-సంగారెడ్డి

2023-24 విద్యా సంవత్సరానికి సంగారెడ్డి జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలకు చెందిన అర్హులైన విద్యార్థులకు జిల్లాలో గల ఇంగ్లీష్ మీడియం పాఠశాల ల్లో బెస్ట్ అవైలబుల్ స్కీం కింద 1వ తరగతికి 125సీట్లు, 5వ తరగతికి 128 సీట్ల ప్రవేశానికి దరఖా స్తులు ఆహ్వానిస్తున్నట్టు షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. 01.06.2017 నుంచి 31.05.2018 మధ్య జన్మించిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల వారు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, మీసేవా ద్వారా పొందిన కులం ధృవీకరణ పత్రం, మీ సేవా ద్వారా పొందిన నేటివిటీ ధృవీకరణ పత్రం, జనన ధృవీకరణ పత్రాలు (మున్సిపల్ కార్పొరేషన్ లేదా తహసీల్దార్), మీ సేవ ద్వారా పొందిన ఆదాయం ధృవీకరణ పత్రాలతో ఈనెల మూడు నుంచి 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. అయితే ఆదాయ ధృవీకరణ మాత్రం 01-04-2023 తరువాత జారీ చేసి ఉండాలని.. అలాగే గ్రామీణ ప్రాంతాల వారికి రూ. 1,50,000 మరియు పట్టణ ప్రాంతాల వారికి రూ.2,00,000 లోపు ఆదాయం ఉండాలన్నారు. 1వ తరగతి ప్రవేశం కోసం యూకేజీ చదివిన స్కూల్ బోనాఫైడ్ మరియు ప్రోగ్రెస్ కార్డ్ ఉండాలన్నారు.

తలెల్మలో 'ఇంటింటికి బీజేపీ'లో బాబు మోహన్

నవతెలంగాణ-జోగిపేట



ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని తలెల్మ గ్రామంలో మాజీ మంత్రి బాబు మోహన్ సోమవారం ఇంటింటికి బీజేపీ కరపత్రాన్ని పంపిణీ చేశారు. సందర్భంగా బాబు మోహన్ మాటాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి జరుగుతున్నదన్నారు. 20 రాష్ట్రాల్లో బీజేపీ పార్టీని అధికారంలోకి తెచ్చిన ఘనత నరేంద్ర మోడీ దేనని, ఆయన చేసిన పనులే పార్టీని గెలిపిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరక్ రాయప్ప గౌడ, జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్.జగన్నతం, మండల అధ్యక్షులు నవీన్, పట్టణ అధ్యక్షులు సయ్య సాయి, బీజేపీ నాయకులు శేఖర్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.



చింతా ప్రభాకర్‌ను కలిసిన నాగభూషణం

నవతెలంగాణ-సదాశివపేట

సదాశివపేట మార్కెట్ కమిటీ నూతన డైరెక్టర్‌గా నియమి తులైన సదాశివపేట పట్టణానికి చెందిన బోడగామ నాగభూషణం సోమవారం సంగారెడ్డిలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర చేనేత కార్పొరేషన్ చైర్మెన్ చింత ప్రభాకర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాగభూషణంను శాలువా పూలదండతో చింతా ప్రభాకర్ సత్కరించి.. శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఎంఆర్ డెవలపర్ పులిమామిడి రాజు, సంగారెడ్డి మార్కెట్ కమిటీ అధ్యక్షులు ప్రభు గౌడ్, సీడీసీ చైర్మెన్ కాసాల బుచ్చిరెడ్డి, విట్టల్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీ.. ఇద్దరి మృతి





నవతెలంగాణ-హత్నూర

ఎదురెదురుగా వస్తున్న కారు, బైక్ ఢీకొట్టుకోవడంతో ఇద్దరు వ్యకులు మృతి చెందారు. ఈ ఘటన తుర్కల ఖానాపూర్ గ్రామ శివారులోని ఎమ్మెన్నార్ ఫార్మా కంపెనీ దగ్గర సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. హత్నూర మండలం నవపేట గ్రామానికి చెందిన కంసాలి శ్రీశైలం, ఎరుకలి రాములు దౌల్తాబాద్ నుంచి బోరుపట్ల గ్రామంలో గల అరబిందో ఫార్మా కంపెనీలో పనిచేయడానికి బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో తురకల్ ఖానాపూర్ గ్రామ శివారులోని ఎమ్మెన్నార్ పరిశ్రమ సమీ పంలో సంగారెడ్డి నుంచి దౌల్తాబాద్ వైపు వస్తున్న కారు బలంగా బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు అక్కడి కక్కడ మృతి చెందారు. మృతుడు ఎరుకలి రాములు భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-నారాయణఖేడ్

మండలంలోని బంద్రాస్‌పల్లి గ్రామానికి చెందిన అంబదాస్ భార్య అనిత ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.21,000 చెక్కును ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి తనయులు మహారెడ్డి రోషన్‌రెడ్డి సోమ వారం అందజేశారు. ఈ సందర్భంగా రోషన్‌రెడ్డి మాట్లాడుతూ.. నిరుపేదల సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లవేళలా కృషి చేస్తున్నదన్నారు. బంద్రాస్‌పల్లి సర్పంచ్ కిష్టయ్య, ఖానాపూర్ కె సర్పంచ్ కవిత గోపాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ మాణిక్ రెడ్డి తదితరులు ఉన్నారు.



పలారం బండి కార్యక్రమంలో పాల్గొన్న మాణిక్యం

నవతెలంగాణ-సదాశివపేట

సదాశివపేట పట్టణంలోని శ్రీ దుర్గా భవాని పలారం బండి యాత్రను ఆదివారం సాయంత్రం పట్టణంలోని హట్కరిపేట మీదుగా ఘనంగా నిర్వహించారు. యువత డప్పు చప్పులతో అమ్మవారిని ఊరేగించారు. ఈ మహోత్సవానికి డీసీసీబీ వైస్ చైర్మెన్ పట్నం మాణిక్యం ముఖ్యఅతిథిగా హాజరవగా.. గజమాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సదాశివపేట మున్సిపల్ వైస్ చైర్మెన్ చింత గోపాల్, కొండాపూర్ ఎంపీపీ మనోజ్ రెడ్డి, వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మెన్ కోడూరు రమేష్, కొండాపూర్ మండల రైతుబంధు అధ్యక్షులు మల్లేశం, కౌన్సిలర్ సాతాని శ్రీశైలం పాల్గొన్నారు.



అరకటికే నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-సదాశివపేట

ఆరెకటిక కుల జిల్లా అధ్యక్షులు కే.ఎస్ రాందాస్ ఆధ్వర్యంలో సోమవారం గురుపౌర్ణమిని పురస్కరించుకొని పట్టణంలోని కార్యాలయంలో కుల గురువైన ధర్మ వ్యాధుడు చిత్రపటానికి పూల మాలలు అర్పించారు. అనంతరం అరకటికె మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సదాశివపేట మండల అధ్యక్షుడిగా భూయాకర్ దస్తగిరి, మండల ఉపాధ్యక్షుడిగా వినోద్ కుమార్, ఆత్మకూర్ గ్రామ కుల అధ్యక్షుడిగా భూయాకర్ పరశురాం, గ్రామ ప్రధాన కార్యదర్శిగా చంద్ర మోహన్, ఉపాధ్యక్షులుగా రాంచందర్, కార్యదర్శిగా రాజు, సంయుక్త కార్యదర్శిగా శివ కుమార్‌లను నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాందాస్ మాట్లాడుతూ.. కుల బంధువులందరూ ఐకమత్యంగా ఉంటూ సంఘం ద్వారా ఎప్పటికప్పుడు సమాచారాన్ని పొందుతూ ప్రభుత్వం ఇస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే కుల సంఘం ద్వారా కుల బంధువుల సమస్యలకు సమాధానం చూపాల్సిన బాధ్యత కులసంఘాల అధ్యక్షులదన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్ కుమార్, బాలు, బస్వాజి, పవన్ తదితరులు పాల్గొన్నారు.



బహిరంగ సభను జయప్రదం చేసినందుకు కృతజ్ఞతలు

నవతెలంగాణ -సదాశివపేట

మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమాలను నిర్వహించి.. ఇటీవలే సదాశివపేట పట్టణంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభను విజయవంతం చేసినందుకు పార్టీ కార్యకర్తలకు, నాయకులకు బీజేపీ రాష్ట్ర నాయకులు శివరాజ్ పాటిల్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు సారా కృష్ణ, శ్రీశైలం యాదవ్ పాల్గొన్నారు.

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు











నవతెలంగాణ-సంగారెడ్డి

గురుపౌర్ణమి వేడుకలను జిల్లా వ్యాప్తంగా సోమ వారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజా మునే ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సంగారెడ్డి పట్టణంలోని కలెక్టరేట్ సమీపంలో గల దత్తాత్రేయ సాయిబాబా మందిరంలో నిర్వహించిన గురు పౌర్ణమి వేడుకల్లో టీఎస్ హెచ్‌డీసి చైర్మెన్ చింత ప్రభాకర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు సుఖ సంతోషాలతో చల్లగా ఉండాలని కోరుకున్నట్టు తెలి పారు. కాగా చింతా ప్రభాకర్‌ను ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రామప్ప, శ్రీకాంత్ బీఆర్ఎస్ నా యకులు మల్లా గౌడ్, పాండు, నాగరాజు గౌడ్, వెంక టేశ్వర్లు, నర్సింలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సదాశివపేట : గురు పౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీ శివ పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయాన్ని డీసీసీబీ ఉమ్మడి జిల్లా వైస్ చైర్మెన్ పట్నం మాణిక్యం సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువా, పూల దండ లతో ఘనంగా సత్కరించారు. ఆంజనేయస్వామి కృపతో నియోజకవర్గ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని వేడుకున్నట్టు మాణిక్యం తెలిపారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు గాండ్ల విశ్వనాథం, గౌరవ అధ్యక్షులు సాయిగౌడ్, సత్యనా రాయణ, శ్రీనివాస్, నరేందర్ రెడ్డి, శ్రీకాంత్ శ్రీకాంత్, ఆంజనేయులు, వీరేశం, సురేష్, చంద్ర సేనగౌడ్, దొడ్ల నర్సింలు జీవన్, అశోక్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ఐడీఏబొల్లారం : బాచుపల్లిలోని శ్రీ సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చంద్రారెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రమీల , ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

బొల్లారంలోని శిరిడీ సాయి భవానీ శంకర్ ఆలయంలో గురుపౌర్ణమిని పురస్కరించుకుని.. తెల్లవారుజాము నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. జిన్నారం మాజీ జడ్పీటీసీ కొలను బాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ కొలను రోజా బాల్ రెడ్డి,మాజీ ఎంపీపీ కొలను రవీందర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భజన, కోలాటాలు వాయిద్యాలతో అలరించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

ఝరాసంగం : మండలంలోని బర్దిపూర్ గ్రామంలో గల శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో సోమవారం గురు పౌర్ణమి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతి శ్రీ 108 వైరాగ్య శిఖామని అవధూత గిరి మహారాజ్, మహంత్ సిద్దేశ్వర స్వామి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, ప్రభాస్ పేరి, శ్రీదత్తాత్రేయ స్వామి వారికి అభిషేకము, శ్రీ దత్త యజ్ఞము, పూర్ణాహుతి ఆశ్రమ పీఠాధిపతి, మహంతి సిద్దేశ్వర స్వామి వారికి రథోత్సవం భక్తి శ్రద్ధలమధ్య నిర్వహి ంచారు. భక్తులు పీఠాధిపతులకు తులాభారం చేశారు. అదేవిధంగా మల్లయ్య గట్టు, ధనశ్రీ మహారాజ్ ఆశ్రమాలలో గురు పౌర్ణమి సందర్భంగా భక్తులు పూజ కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

నేడు దొడ్డి కొమురయ్య వర్ధంతి అధికారిక నిర్వహణ

నవతెలంగాణ-సంగారెడ్డి

నేడు దొడ్డి కొమరయ్య వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ సోమవారం ఓ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నేడు ఉదయం 10:00 గంటలకు సంగారెడ్డి పట్టణం కలెక్టరేట్ ఆపోజిట్ హనుమాన్ టెంపుల్ వద్ద గల దొడ్డి కొమురయ్య విగ్రహానికి పూలమారాంకరణ చేసి నివాళులర్పిస్తారని పేర్కొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కీం కింద సీట్ల భర్తీకి ఆహ్వానం

నవతెలంగాణ-సంగారెడ్డి

2023-24 విద్యా సంవత్సరానికి సంగారెడ్డి జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలకు చెందిన అర్హులైన విద్యార్థులకు జిల్లాలో గల ఇంగ్లీష్ మీడియం పాఠశాల ల్లో బెస్ట్ అవైలబుల్ స్కీం కింద 1వ తరగతికి 125సీట్లు, 5వ తరగతికి 128 సీట్ల ప్రవేశానికి దరఖా స్తులు ఆహ్వానిస్తున్నట్టు షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. 01.06.2017 నుంచి 31.05.2018 మధ్య జన్మించిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల వారు ఆధార్‌కార్డు, రేషన కార్డు, మీసేవా ద్వారా పొందిన కులం ధృవీకరణ పత్రం, మీ సేవా ద్వారా పొందిన నేటివిటీ ధృవీకరణ పత్రం, జనన ధృవీకరణ పత్రాలు (మున్సిపల్ కార్పొరేషన్ లేదా తహసీల్దార్), మీ సేవ ద్వారా పొందిన ఆదాయం ధృవీకరణ పత్రాలతో ఈనెల మూడు నుంచి 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. అయితే ఆదాయ ధృవీకరణ మాత్రం 01-04-2023 తరువాత జారీ చేసి ఉండాలని.. అలాగే గ్రామీణ ప్రాంతాల వారికి రూ. 1,50,000 మరియు పట్టణ ప్రాంతాల వారికి రూ.2,00,000 లోపు ఆదాయం ఉండాలన్నారు. 1వ తరగతి ప్రవేశం కోసం యూకేజీ చదివిన స్కూల్ బోనాఫైడ్ మరియు ప్రోగ్రెస్ కార్డ్ ఉండాలన్నారు.

స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వాహణకు ప్రణాళికలు వేసుకోవాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

జిల్లాలో స్వేచ్ఛయుత ఎన్నికల నిర్వహణకు ముందస్తు ప్రణాళికతో పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు ముందస్తు ప్రణాళికతో, సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ శరత్ జిల్లా ఎస్పీ రమణ కుమార్‌తో కలిసి డీఎస్పీలు, రెవిన్యూ డివిజన్ అధికారులు, తహశీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రానున్న ఎన్నికలు జిల్లాలో స్వేచ్చాయుత వాతావరణంలో నిర్వహించుటకు ప్రణాళికతో పనిచేయాలన్నారు. గత ఎన్నికల విషయ పరి జ్ఞానంతో జిల్లాలోని సమస్యాత్మక గ్రామాలను, ప్రాంతాలను, పోలింగ్ కేంద్రాలను గుర్తించాలన్నారు.వొనరెబుల్ ప్లేసెస్‌కు సంబంధించిన వివరాలు సేకరించాలన్నారు.ఈ సిబికి ఆయా నివేదికను పంపాలని సూచించారు. పొలిటికల్ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి, వారి నుండి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వివరాలను తెలుసుకోవాలన్నారు. ఈసిఐ అందజేసిన నిర్ణీత ప్రోఫార్మాలో ఆయా వివరాలను అందజేయాలని సూచించారు. వొనరబుల్ ప్లేసెస్ కు సంబంధించి మ్యాపి ంగ్ చేయాలని సూచించారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు కోఆర్డినేషన్ తో పని చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్పీ రమణకుమార్, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డిఆర్ఓ నగేష్, డిఎస్పీలు, ఆర్‌డిఓ ల ు, తహాశీల్దార్లు, ఎన్నికల విభాగం సూపరింటెంట్ పాల్గొన్నారు.

జీవితాల్లో జ్ఞాన జ్యోతిని వెలిగించే వారే గురువులు

నవతెలంగాణ-రామచంద్రాపురం



ప్రతి ఒక్కరి జీవితంలో జ్ఞనం అనే చీకటిని పారద్రోలి జ్యోతిని వెలిగించేవారే గురువులని, గురువు లేని విద్య గుడ్డి విద్య అని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గురు పౌర్ణమి పర్వదినం పురస్కరించుకొని భారతీయ నగర్ డివిజన్ పరిధిలోని మ్యాక్ సొసైటీలో గల శ్రీ సాయిబాబా దేవాలయంలో ఏర్పాటు చేసిన గురుపూర్ణిమ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరి జీవితంలో గురువుకు ఎంతో ప్రాధాన్యత ఉంటుందని, తమ శిష్యులను అత్యంత ప్రతిభావంతులుగా తీర్చిదిద్దే గొప్ప వ్యక్తి గురువు అన్నారు. గురు పౌర్ణమి రోజు ప్రతి ఒక్కరూ తమ గురువుల ఆశీర్వాదం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ భూపాల్ రెడ్డి, కౌన్సిలర్లు సింధు ఆదర్శ రెడ్డి, పుష్ప నగేష్, బీఆర్ఎస్ పార్టీ సర్కిల్ అధ్యక్షులు పరమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు గోవింద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఐలేష్, సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం పట్టణంలోని సాయి నగర్ కాలనీలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి గోదావరి అంజిరెడ్డి ఆధ్వర్యంలో గురు పౌర్ణమి సందర్భంగా సాయి బబా ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మందపూర్ పేద రైతులకు న్యాయం చేయాలి

ధరణిలో అసైన్డ్ రైతుల పేర్లను వెంటనే ఎక్కించాలి

రైతు సంఘం రాష్ట్ర నాయకులు జయరాజు

నవతెలంగాణ-సంగారెడ్డి



కొండాపూర్ మండలంలోని మందపూర్ గ్రామంలో గల పేద రైతులకు న్యాయం చేయాలని రైతు రాష్ట్ర నాయకులు గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద రైతులతో కలిసి ధర్నా చేసి అనంతరం డీఆర్‌ఓకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జయరాజ్ మాట్లాడుతూ.. మందపూర్ గ్రామంలోని సర్వేనెంబర్ 22లో అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ పేదలకు భూ పట్టాలిచ్చారని.. అప్పటినుంచి రైతులు భూమిని సాగు చేసుకుంటున్నారన్నారు. అయితే వారికి ఇప్పటి వరకూ కొత్త పట్టా పాస్ పుస్తకాలను ఇవ్వ లేదన్నారు. కాగా కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత భూప్రక్షాళన పేరుతో ఆ రైతుల పేర్లను ధరణీ ఆన్‌లైన్‌లో ఎక్కించలేదన్నారు. దీంతో రైతుబంధు, రైతుబీమా కూడా రాకపోవడంతో బాధిత రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి.. సాగులో ఉన్న రైతులకు భూములను ఆన్‌లైన్ చేయాలన్నారు. పట్టాపాసు పుస్తకాలు ఇచ్చి న్యాయం చేయాలన్నారు. బాధిత రైతులు పట్టా పాస్ పుస్తకాలు వచ్చే వరకు అందరూ ఐక్యంగా ఉండి పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కే. రాజయ్య, కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం నర్సింహులు, మండల నాయకులు రైతులు అమృతమ్మ, కమలమ్మ, ఏసన్న, చంద్రయ్య, అనిత, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాన్ని రూ.26వేలకు పెంచాలి



నవతెలంగాణ-జహీరాబాద్

కనీస వేతనాలను రూ.26 వేలకు పెంచాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహిపాల్ డిమాండ్ చేశారు. సోమవారం జహీరాబాద్ పట్టణంలోని వివిధ పరిశ్రమల్లో కాంట్రాక్టు కార్మికులకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మహిపాల్ మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేల రూపాయలు ఇవ్వాలని, పెండింగ్లో ఉన్న 73 రకాల షెడ్యూల్ ఎంప్లాయిమెంట్ జీవోలను తక్షణమే సవరించాలని డిమాండ్ చేశారు. జూలై 6న జరిగే రాష్ట్ర జీపు జాతా జయప్రదం చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో వివిధ పరిశ్రమలలో కరపత్రాలను పంపిణీ చేసినట్టు తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది మంది కార్మికులను కాదని పెట్టుబడిదారుల పక్షాన ఉంటూ కార్మికులకు అన్యాయం చేస్తున్నాయన్నారు. కనీస వేతనాలను సవరించకుండా పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తున్నాయని, తక్షణమే 73 రకాల కనీస వేతనాలను సవరించి 26వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త జీపు జాత లో భాగంగా జహీరాబాద్ కు 6న వస్తుందని కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహీంద్రా సీఐటీయూ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, నాయకులు బాల్ రాజ్, మసి, మహేష్, నరేష్, సూరి, శ్రీధర్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపులకు భయపడేది లేదు

నవతెలంగాణ-పట్‌పల్లి



'మండలంలో జరిగిన అభివృద్ధి ఏమిటి.. ఉంటే ఎక్కడో చూయించాలి' అని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను చించి వేయడమే కాకుండా తమ పార్టీ కార్యకర్తలను బీఆర్ఎస్ నాయకులు బెదిరిస్తు న్నారని.. వారి బెదిరింపులకు భయపడేది లేదని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రమేష్ జోష్, యూత్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డిలు అన్నారు. ఈ మేరకు సోమవారం సంబంధిత బీఆర్ఎస్ నాయకులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. మండలంలో జరిగిన అభివృద్ధి పై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. దామోదర రాజనర్సింహ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఉప ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజాముఖంగా వెల్లడించడానికి కాంగ్రెస్ పార్టీ తరఫున తాము సిద్ధంగా ఉన్నామని.. ఇందుకు మీరు సిద్ధంగా ఉన్నారా అని బీఆర్ఎస్ నాయకులకు సవాల్ విసిరారు. మండలంలో ఎన్నో సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే.. బీఆర్ఎస్ నాయకులకు కనిపి ంచడం లేదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై బెదిరిం పులు మానుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆయా గ్రామాల పార్టీల అధ్యక్షులు దిగంబర్ రావు, కచ్చుర్ రావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కాగా ఎస్సై అంబర్యా మాట్లాడుతూ..

కాంగ్రెస్ నాయకులు సోమవారం ఫిర్యాదు చేయగా.. ఒకరోజు ముందే బీఆర్ఎస్ నాయకులు ఫిర్యాదు చేశారన్నారు. ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారని.. ఈ ఫిర్యాదులను డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లి.. వారి ఆదేశానుసారం చర్యలు తీసుకుంటామన్నారు.

నిరుపేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి





నవతెలంగాణ-జహీరాబాద్

నిరుపేదలకు ఎల్లవేళలా ముఖ్యమంత్రి సహాయనిధి అండగా ఉంటుందని ఎమ్మెల్యే మాణిక్ రావు అన్నారు. ఝరాసంగం మండలం గినియర్పల్లీ గ్రామానికి చెందిన పలువురు ఇటీవలే అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చేరారు. వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఎండీ.నబీషాకు రూ.1 లక్ష, ఎన్. సాయికుమార్ రూ.20 వేలు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన చెక్కులను లబ్దిదారుల కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే సోమవారంఅందచేశారు. ఈ కార్యక్రమంలో నర్సింహారెడ్డి సర్పంచ్, అహ్మద్‌పటేల్ ఉపసర్పంచ్, మాజీ సర్పం చ్ నర్సింలు, బాబు పటేల్, మోయిజ్ తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ పట్టణంలోని మాణిక్ ప్రభు వీధికి చెందిన శేఖర్‌కు లక్ష రూపాయల చెక్కును క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో ఇప్పెపల్లి పీఏసీఎస్ చైర్మెన్ మచ్చందర్, మాజీ కౌన్సిలర్ బండి మోహన్, నాయ కులు ఇజ్రాయేల్ బాబీ, లక్ష్మీకాంత్, దీపక్ ఆప్పి పాల్గొన్నారు.



సీసీరోడ్డు పనులు ప్రారంభించిన జెడ్పీటీసీ

నవతెలంగాణ-న్యాల్‌కల్

మండల కేంద్రంలోని శివాజీ విగ్రహం నుంచి ఖాదర్ ఇంటి వరకు స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.10 లక్షలతో 290 మీటర్ల సీసీరోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ శివ శంకరయ్య స్వామి ఆధ్వర్యంలో జడ్పీటీసీ స్వప్నభాస్కర్ సోమవారం ప్రారం భించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల అభివృద్దే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభు త్వం పనిచేస్తున్నదన్నారు. కాబట్టి అన్నీ గ్రామాల అభివృద్ధి కోసం పాటుపడుతూ, మండలాన్ని అన్నీ రంగాలలో అభివృద్ధి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అబ్దుల్ ఖాదర్, ఎంపీటీసీ తనయుడు వెంకట్, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, వార్డ్ మెంబెర్స్ శివరాజ్, బస్వారాజ్,మైనార్టీ మండల ఉపాధ్యక్షులు మఖ్సూద్, నాయకులు హెూతి నాగిశెట్టి, బసయ్య స్వామి, ప్రవీణ్, డీలర్ జమీల్ , శివస్వామి తదితరులు పాల్గొన్నారు.



మిషన్ భగీరథ పనుల పరిశీలన

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపల్ పరిధిలోని స్థానిక కేబీఆర్ కాలనీ, వైస్సార్ కాలనీల్లో ప్రారంభమైన మిషన్ భగీరథ పైప్ లైన్ కనెక్షన్ పనులను మాజీ జెడ్పీటీసీ కొలన్ బాల్ రెడ్డి అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బాల్‌రెడ్డి మాట్లాడుతూ.. త్వరలో మిషన్ భగీరథ మంచి నీళ్ళు అందు బాటులోకి రానున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీనివాస్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, కాలనీ వాసులు పాల్గుణ రావు,రాజేశ్వర్ రెడ్డి,ఈశ్వర్, జనార్ధన రావు పాల్గొన్నారు.



ప్రజావాణికి వినతుల వెల్లువ

జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజలు
అర్జీలు స్వీకరించిన కలెక్టర్ రాజర్షి షా



నవతెలంగాణ-మెదక్ : మెదక్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అర్జీలను సమర్పించారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన 41 అర్జీలను కలెక్టర్ రాజర్షి షా అదనపు కలెక్టర్ రమేష్‌తో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలన్నారు. ఎక్కువగా ఉపాధి అవకాశాలు, పెన్షన్లు, వివిధ రకాల రెవెన్యూ సమస్యలపై ఫిర్యాదులు వస్తున్నాయని, సంబంధిత అధికారులు పరిశీలించి, పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్లో ఇరు వర్గాల ఫిర్యాదు

- విచారిస్తామన్న పోలీసులు




నవ తెలంగాణ -గజ్వేల్/ప్రజ్ఞాపూర్ : విప్లవ వీరుని విగ్రహం వద్ద ఓ వర్గానికి చెందిన వ్యక్తి మూత్ర విసర్జన చేశారని ఆరోపిస్తూ స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో మరో వర్గం రాస్తారోకోకు దిగింది. సోమవారం రాత్రి గజ్వేల్ పట్టణంలో పిడిచేడు రోడ్డులో ఉన్న విప్లవ వీరుని విగ్రహం వద్ద మూత్ర విసర్జన చేస్తున్న వ్యక్తిని చూసిన స్థానికులు ఆయనను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. మూత్ర విసర్జన చేసిన అతనిపై విచారించి కేసు నమోదు చేస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. స్థానిక పోలీస్ స్టేషన్ వెళ్లి సిఐ వీరప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపించి కేసు నమోదు చేస్తామని చెప్పారు. అనంతరం విప్లవ వీరుని విగ్రహం వద్ద మూత విసర్జన చేసిన వ్యక్తి మద్దతుదారులు పోలీస్ స్టేషన్ వెళ్లి సిఐ వీర ప్రసాదును కలిసి సమస్యను వివరించారు. అరెస్టు చేసిన వ్యక్తిని వదిలిపెట్టాలని విజ్ఞప్తి చేశారు. రెండు వర్గాలు ఫిర్యాదు చేయడంతో స్థానిక పోలీసులు పట్టణంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసులు అప్రమత్తమై రాత్రి వేళలో పెట్రోలింగ్ ఏర్పాటు చేశారు.

ఆదర్శ మున్సిపల్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

మున్సిపల్ చైర్మన్ బొంది రాఘవెందర్‌గౌడ్



నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

తూప్రాన్ మున్సిపల్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పూర్తి నాణ్యతతో చేపట్టి పరిశుభ్రంగా ఉంచడంతో మున్సిపల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు మున్సిపల్ చైర్మన్ బొంది రాఘవెందర్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని ఒకటవ వార్డులో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. పనులను పూర్తి నాణ్యతతో చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మంతి హరీశ్‌రావ్ ప్రోత్సాహంతో మున్సిపల్‌కు నిధులు మంజూరైనట్టు తెలిపారు. దాంతో మున్సిపల్‌ను పారిశుద్యంలో ఆదర్శంగా తీర్చిదిద్దనున్నట్టు తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందరికి అందుబాటులో ఉండి సేవలందిస్తున్నట్టు తెలిపారు. అనంతరం పెద్ద చెరువు కట్ట వద్ద చేపడుతున్న చిల్డ్రన్స్ పార్కులోని వాల్ నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను సకాలంలో పూర్తి చేసి పార్కును ఎక్కడా లేని విధంగా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని కాంట్రాక్టర్‌కు పలు సూచనలు సలహాలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ సాయిరాంరెడ్డి, కౌన్సిలర్ మామిడి వెంకటేశ్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి జెడ్పీటీసీ రూ. 35 వేల విరాళం

నవతెలంగాణ-నర్సాపూర్



నర్సాపూర్ మండల పరిధిలోని మూసాపేట్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి సోమవారం శివంపేట జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా తన వంతు సహాయంగా రూ.35 వేల విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఆలయ నిర్మాణానికి రూ.35 వేల విరాళం అందజేసినందుకు మూసాపేట గ్రామస్తులు జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తకు కృతజ్ఞతలు తెలియజేసి శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బలరాం రెడ్డి, జగన్, ప్రసాద్ , సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

అనాథ కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-నిజాంపేట



మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన దళిత కులానికి చెందిన శివరాజయ్య (60) గుండెపోటుతో ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే అతనికి ఎలాంటి ఆస్తిపాస్తులు లేక పేదరికంతో జీవనం కొనసాగిస్తున్నాడు. అతనికి ముగ్గురు బిడ్డలు ఇద్దరి బిడ్డల సంసారాలు బాగా లేనందున తండ్రి దగ్గరనే బతుకు తున్నారు. ఉన్న ఇల్లు శిథిలావస్థలో ఉండగా వేరే ఇంటిలో కిరాయి ఉంటుండేవాడు. అతడు చనిపోయిన తర్వాత ఇంటి యజమానులు అతని శవాన్ని తీసుకువెళ్లాలని జబర్దస్తీ చేయడంతో శిథిలావస్థలో ఉన్న ఇంటిలోనికి శవాన్ని తీసుకువచ్చారు. వారికి ఆర్థిక పరిస్థితి బాగా లేనందున ఈ విషయం తెలుసుకున్న మైనంపల్లి రోహిత్ రావ్ చలించిపోయి రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని వారి అనుచరుల ద్వారా పంపించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు వెల్దుర్తి వెంకటేష్ గౌడ్,అజయ్, కాస రాజేశం, భాస్కర్ గౌడ్, బోయిని నాగరాజు, కమ్మరి రవి, భత్తుల మధు, మిరుదొడ్డి కుమార్, భత్తుల యాదగిరి, మాసుల రమేష్, మంగలి స్వామి, గాలం లక్ష్మణ్ ,బత్తుల పవన్, గొడుగుపల్లి కుమార్, ఎం రాజు పాల్గొన్నారు

ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లు ధ్వంసం

నవతెలంగాణ-చేగుంట



చేగుంట మండల కేంద్రం రైల్వే స్టేషన్ రోడ్‌లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం అర్ధరాత్రి ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు మరుగుదొడ్లను ధ్వంసం చేశారు. సోమవారం ఉదయం యధావిధిగా ఉపాధ్యాయులు పాఠశాలకు వచ్చి చూడగా టాయిలెట్స్ ధ్వంసమై ఉన్నాయి. వెంటనే పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్, ఉపాధ్యాయులు ప్రజా ప్రతినిధులకు, విద్యాశాఖ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా మరుగుదొడ్లను ఏర్పాటు చేశామని, ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు ఇలా ధ్వంసం చేయడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురవుతారని, ఇటువంటివి మళ్లీ పునరావతం కాకుండా పై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు చల్ల లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గణాంకదర్శిని పుస్తక ఆవిష్కరణ

నవతెలంగాణ-మెదక్



జిల్లా గణాంకదర్శిని 2021-2022 పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక ప్రణాళిక విధాన, రూపకల్పనలో ముఖ్యమైనదన్నారు. రోజువారి జీవితంలో గణాంకాల వాడకం విధానాలను రూపొందించుటలో గణాంకాలు దోహదపడతాయని తెలిపారు. జిల్లా గణాంక దర్శినిలో జనాభా, వాతావరణం, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, విద్య, రవాణా, నీటి వనరులు, పంటలు, కమ్యూనికేషన్, బ్యాంకింగ్, ఫైనాన్స్, లోకల్ బాడీ, ఇండస్ట్రీస్ సోషల్ సెక్యూరిటీకి సంబంధించిన అంశాలు వివరంగా ఉంటాయని తెలిపారు. గణాంక దర్శినిలో అన్ని శాఖల జిల్లా గణాంక వివరాలు పొందుపరచడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రమేష్, ముఖ్య ప్రణాళిక అధికారి కె. కృష్ణయ్య, జిల్లా వ్యవసాయ అధికారిణి ఆశాకుమారి, డీఈఓ రాధాకృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగులకు ఉచిత గుండె వైద్య శిబిరం

నవతెలంగాణ-మెదక్



మెదక్ జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయంలో సోమవారం యశోద హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారులకు, ఉద్యోగులకు, సిబ్బందికి గుండె సంబంధిత వ్యాధుల పై పరీక్షలు నిర్వహించారు.192 మందికి బీపీ, ఈసిజి, 2డికో తో పాటు తదితర పరీక్షలను అధికారులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డిఈ కృష్ణారావు, యశోద హాస్పిటల్స్ మేనేజర్ వినయ్ కుమార్, డాక్టర్లు గోపీనాథ్, మోహన్ కిరణ్, మధు, అభిరామ్, హర్ష తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ మండల పరిధిలోని ఆవంచ, మూసాపేట్, కాగజ్ మద్దూర్, సబ్ స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజ్ కుమార్ సోమవారం తెలిపారు. నర్సాపూర్ పట్టణంలోని 132/33 కె.వి సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తులు చేపడుతున్నందున ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ఆగని ఇసుక అక్రమ దందా

- అధికారుల హెచ్చరికలు బేఖాతరు
- రామాయంపేటలో గుట్టలుగా ఇసుక డంపులు
- చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్న అధికారులు

నవతెలంగాణ-రామాయంపేట

అక్రమంగా ఇసుకను తీసుకొచ్చి, వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ, నిత్యం లక్షల రూపాయల వ్యాపారం చేస్తున్నారు.గతంలో పత్రికల్లో వచ్చిన కథనాలకు స్పందించిన అధికారులు ఇసుక డంపులపై దాడులు చేసి హెచ్చరికలు చేశారు. అధికారుల హెచ్చరికలను బేఖాతరు చేస్తూ తిరిగి వ్యాపారం కొనసాగిస్తున్నారు. మమ్మల్ని ఎవరేం చేస్తారు అన్న ధీమా అక్రమ ఇసుక వ్యాపారుల్లో కనిపిస్తుంది. రామయంపేటలో ఇసుకాసురులు తిరిగి వాళ్ళ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఇసుకను రోడ్డు పక్కన గుట్టలుగా పోసి యదేచ్చగా వ్యాపారం చేస్తున్నారు. రామాయంపేట పట్టణంలోని నిజామాబాద్ రోడ్డు వైపు ముగ్గురు వ్యాపారులు ఈ వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా నడిపిస్తున్నారు.

వాల్టా చట్టానికి తూట్లు



రామాయంపేట పట్టణంలో అక్రమంగా ఇసుక రవాణా చేసే వ్యాపారులు, రామాయంపేట ఉమ్మడి మండల పరిసర ప్రాంతాలలో ఉన్న వాగుల నుంచి, అటవీ ప్రాంతాల నుంచి రాత్రి వేళలో లారీల ద్వారా తీసుకొచ్చి, ఇక్కడ నిలువ చేసి విక్రయాలు చేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే పాత వే బిల్లులను చూపించి వ్యాపారం నిర్వహిస్తున్నారు. అలాగే ఇతర ప్రాంతాలకు వెళ్లే వే బిల్లులు కూడా వాడుకుంటున్నారు. గతంలోనూ పలుమార్లు రెవిన్యూ అధికారులు ఇసుకడంపులపై దాడులు చేసి ఇసుకను సీజ్ చేసి హెచ్చరికలు జారీ చేశారు. అనుమతులు లేకుండా ఇసుక వ్యాపారం నిర్వహిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని వారిని హెచ్చరించారు. రామాయంపేటలో ఇసుక వ్యాపారంకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని మైనింగ్ అధికారులు చెప్తున్నారు. అయినా రామాయంపేట పట్టణంలో యదేచ్ఛగా ఇసుక వ్యాపారం జరగడంపై రెవెన్యూ అధికారులు, మైనింగ్ అధికారులపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కర్తలకు ఆహ్వానం

కలెక్టర్ రాజర్షి షా
నవతెలంగాణ-మెదక్



ప్రతి ఒక్కరిలో ఏదో ఒక ప్రతిభ ఉంటుందని, దానిని వెలికితీసి ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రతి ఏటా ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని కలెక్టర్ రాజర్షి షా సోమవారం తెలిపారు. ఇందులో భాగంగా స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విద్యావేత్తలు, రైతులు, గృహిణులు, మెకానిక్‌లు ఇలా ఎవరైనా తమ సృజనాత్మక ఆవిష్కరణలను ఆగస్టు 5వ తేదీలోగా వాట్సాప్ నంబర్ 9100678543కు పంపాలన్నారు. అందులో ఆవిష్కరణకు సంబంధించి ఆరు వాక్యాలు, రెండు నిమిషాల వీడియో, ఆవిష్కరణ యొక్క నాలుగు ఫోటోలు, ఆవిష్కర్త పేరు, వృత్తి, చిరునామా, చరవాణి వివరాలు కూడా పంపించాలని తెలియజేశారు. దరఖాస్తులను తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ వారి ఆధ్వర్యంలో పరిశీలించి ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి జిల్లా కేంద్రంలో నిర్వహించే స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ఆవిష్కర్తలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదనపు సమాచారం కోసం ఇంటింటా ఇన్నోవేటర్ జిల్లా సమన్వయకర్త రాజిరెడ్డి 8328599157 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

11వ వార్డు ప్రజల రాస్తారోకో

నిర్మాణ లోపంతో అవస్థలు పడుతున్నాం
వార్డు కౌన్సిలర్ చిలక గంగాధర్
నవతెలంగాణ-రామాయంపేట

మురికి కాలువ నిర్మాణ లోపంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడంలేదని నిరసిస్తూ మున్సిపల్ కౌన్సిలర్ చిలక గంగాధర్ ఆధ్వర్యంలో వార్డు ప్రజలతో సిద్దిపేట రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ సిద్దిపేట రోడ్డు వెడల్పులో భాగంగా నిర్మించిన మురికి కాలువ నిర్మాణ లోపం వల్ల చిన్నపాటి వర్షానికి అక్కల బస్తిలోని ఇళ్ళలోకి నీరు చేరుతుందన్నారు. గత పది రోజుల క్రితం కురిసిన చిన్నపాటి వర్షానికి ఇళ్లలోకి మోకాళ్ళ మట్టం నీరు చేరిందన్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ అధికారులు, రోడ్డు విస్తరణ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఈ పది రోజుల నుంచి ఎన్నోసార్లు అధికారులను కలిశానని, అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. దీంతో చేసేది లేక రాస్తారోకోకు దిగామన్నారు. విషయం తెలుసుకున్న రామాయంపేట ఎస్సై రంజిత్ కుమార్ ఘటన స్థలానికి చేరుకొని ఆందోళన చేస్తున్న వారికి నచ్చజెప్పి రాస్తారోకో విరమింప చేశారు.



ఆందోళనతో సమస్య పరిష్కారమైంది-కౌన్సిలర్ గంగాధర్

ఎన్నో రోజులుగా మురికి కాలువ నిర్మాణ రూపంతో ఇబ్బందులు పడుతుంటే అధికారులు పట్టించుకోలేదు. రాస్తారోకోకు దిగి ఆందోళన చేపట్టడంతో అధికారులు మురికి కాలువకు అడ్డుగా ఉన్న గోడను వెంటనే కూల్చివేశారు. దీంతో సమస్య పరిష్కారమైంది. గంట సేపట్లో పరిష్కారమయ్యే సమస్యకు, అధికారుల నిర్లక్ష్యం వల్ల రాస్తారోకోకు దిగాల్సి వచ్చింది.

పీఆర్‌సీ కమిటీని నియమించాలి

టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంగయ్య
నవతెలంగాణ-మెదక్



పీఆర్సీ కమిటీని వెంటనే నియమించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంగయ్య, టిపిటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు కొండల్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మెదక్ పట్టణంలోని టిపిటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిఆర్సీ కమిటీనీ వెంటనే నియమించాలని, అప్పటి వరకు పెరిగిన ధరలకు అనుగుణంగా ఐఆర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సర్దుబాటు కాదు ఉపాధ్యాయుల నియామకం చేపట్టాలన్నారు. గత ఏడాది అంతా జిపిఎఫ్, టిఎస్జిఎల్ఐసి చెల్లింపులు సరెండర్, మెడికల్ బిల్లుల చెల్లింపులు మొత్తం ఆగిపోయి ఉపాధ్యాయులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. ఈ విషయంలో అనేక రకాల ఉద్యమాలు చేసినప్పటికీ ప్రభుత్వం తన మొండి వైఖరిని వీడటం లేదన్నారు. గత 18 ఏళ్లుగా విద్యారంగంలో పర్యవేక్షణ అధికారుల పోస్టులను నింపకుండా సంక్షోభంలోకి నెట్టివేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్రను వీడాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన విధంగా ప్రమోషన్లను బదిలీలను చేపట్టాలని, నూతనంగా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నిధులు, నియామకాలు, నీళ్ల పేరు చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం హామీలను మార్చినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు మన బడి పేరు మీద చేపడుతున్న పనులకు వెంటనే బిల్లులు మంజూరు చేసి పనులు పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాలల్లో సర్వీస్ పర్సన్లను నియమించి అన్ని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డి, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ యాదగిరి, ఉపాధ్యాయదర్శిని ఎడిటర్ శశిధర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు యాదగిరి, విట్టల్ రెడ్డి, గోపాల్, భాగ్యలక్ష్మి, జిల్లా కార్యదర్శిలు నసీరుద్దీన్, కొమ్మ శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి రాష్ట్ర కౌన్సిలర్లు హీరలాల్, సత్యనారాయణ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి కృషి

మెదక్ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి
నవతెలంగాణ - రామాయంపేట



అన్ని వర్గాల సంక్షేమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మెదక్ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి అన్నారు. సోమవారం రామాయంపేట మండలంలో మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి పర్యటించారు. మండల కేంద్రంలోని ఒక బేకరీని ప్రారంభించారు. తన సొంత నిధులతో ఏర్పాటు చేయనున్న అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ చేశారు. అనంతరం కోమటిపల్లి గ్రామం నుంచి కోమటిపల్లి తండా వరకు రూ.78 లక్షలతో వేయనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో రోడ్ల కోసం కోట్లాది రూపాయలు విడుదలయ్యాయని తెలిపారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగ స్ఫూర్తితో ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడారని, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి నేడు అన్ని వర్గాల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు. దళితుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి కేసీఆర్ దళిత బంధు పథకం తీసుకొచ్చారన్నారు. గిరిజన తండాల అభివృద్ధి కోసం తండాలను గ్రామపంచాయతీలుగా చేసి, ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నారన్నారు. రైతుల కోసం రైతుబంధు రైతు బీమా వంటి పథకాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. కాలేశ్వరంతో లక్షల ఎకరాల భూమికి సాగునీరు అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదని తెలిపారు. కుల వృత్తుల వారికి, బీడీ కార్మికులకు వృద్ధులకు ఎన్నో సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టారన్నారు. మెదక్ జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల నిర్మాణానికి త్వరలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా భూమి పూజ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ గజవాడ నాగరాజు, కౌన్సిలర్లు దేమే యాదగిరి,చిలుక గంగాధర్, సుందర్ సింగ్, తోపాటు మున్సిపల్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

నవ తెలంగాణ నర్సాపూర్



నర్సాపూర్ లో గురు పౌర్ణమి వేడుకలను సోమవారం ప్రజలు ఘనంగా నిర్వహించారు. గురు పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని సాయిబాబా ఆలయంలో పట్టణ ప్రజలు ఉదయం నుంచి పంచామృతాలతో అభిషేకాలు. ప్రత్యేక పూజలు చేశారు. సాయిబాబాను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

గురు పౌర్ణమి సందర్భంగా పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-వెల్దుర్తి



మండల పరిధిలోని ఉమ్మడి మాసాయిపేట్ వెల్దుర్తి మండలాల్లో ఉన్న పలు గ్రామాల్లో గురు పౌర్ణమి సందర్భంగా పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు మాసాయిపేట్ షిరిడి సాయిబాబా దేవాలయంలో, వెల్దుర్తి మండల కేంద్రంలో వెంకటేశ్వర స్వామి విఠలేశ్వర ఆలయంలో లక్ష్మమ్మ దేవాలయంలో, కోమటి పల్లెలోని కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు మహిళలు షిరిడి సాయిబాబా సంకీర్తనలు ఆలపించారు దేవుని సన్నిధానంలో గడిపినట్లయితే మంచి ఆలోచన పరిజ్ఞానం ఉంటుందని చెడు ఆలోచనలు దరిచేరవని ఇతరులపై కోపద్వేషాలు ఉండవని మహిళలు అన్నారు. షిరిడి సాయిబాబాకు పండ్లు పలహారం నైవేద్యంగా పెట్టి నామస్మరణ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు

రూ.8 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం

జెడ్పీటీసీ రమేష్ గౌడ్
నవతెలంగాణ-వెల్దుర్తి



మండల పరిధిలో ధర్మారం గ్రామంలో రూ.8 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మించే సీసీ రోడ్డు పనులను సోమవారం జెడ్పీటీసీ రమేష్ గౌడ్ టీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు భూపాల్ రెడ్డి స్థానిక సర్పంచి శంకర్ రెడ్డి మాజీ సర్పంచ్ సత్యం గౌడ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి రమేష్ మాట్లాడారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతగా వేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. సీసీ రోడ్డుపై కట్టలు కట్టి క్యూరింగ్ తప్పకుండా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు ఉన్నారు.

గుడిసె వాసుల మీద దాడిని ఖండించాలి

నవతెలంగాణ-సంగారెడ్డి

మహబూబాబాద్ గుడిసె వాసుల మీద దాడిని ఖండించాలని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక జిల్లా నాయకులు జి.సాయిలు అన్నారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరుపేదలు ఇల్లు లేక అనేక అవస్థలు పడుతూ ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుంటే ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా గుడిసెలను ఖాళీ చేసే ప్రయత్నం చేస్తుందన్నారు. పేదలందరికీ ఇల్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సోమవారం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా పేదలు ప్రభుత్వ అధికారుల దగ్గరికి వచ్చి ధర్నా చేయాలనుకుంటున్నా, ఉదయం 5 గంటలకు మహబూబాబాద్‌లో గుడిసె వాసుల మీద పోలీసులు దౌర్జన్యం చేశారన్నారు. పదిమంది పేదలు గాయపడ్డారన్నారు. 10 మంది మహిళలను అరెస్టు చేశారన్నారు. నాన్‌బెయిల్ కేసులు పెడతామని బెదిరించడాన్ని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక తీవ్రంగా ఖండిస్తుందన్నారు . వెంటనే అరెస్టు చేసిన పేదలను విడుదల చేయాలని, ఇప్పటికైనా పోలీసు దాడులు ఆపాలని, అధికారులు పేదలకు పట్టలు ఇవ్వాలని పోరాట వేదిక తరపున డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ పాలనలోనే సంక్షేమం

వృద్దులకు, వితంతువలకు నాలుగు వేల పెన్షన్‌లపై వృద్దులలో ఆనందం
కాంగ్రెస్‌తోనే రైతులకు గిట్టుబాటు ధర
కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి



నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

కాంగ్రెస్ పానలోనే ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని, వృద్దులకు నాలుగు వేల పెన్షన్ ప్రకటనతో ప్రజలలో ఆనందం వ్యక్తమవుతున్నట్టు కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఖమ్మం బహిరంగ సభలో రాహుల్‌గాంధీ వృద్దులకు పెన్షన్ పెంపు ప్రకటనతో వృద్దులు ఆనందం వ్యక్తం చేస్తూ సోమవారం తూప్రాన్ మున్సిపల్ కేంద్రంలో రాహుల్‌గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్బంగా కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలోనే రైతులకు, వృద్దులకు, రుణమాఫీ, ఇందిరమ్మ గృహ పథకాలు అమలై ప్రజలందరికి సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఇందిరమ్మ గృహ పథకం ద్వారా రూ. 5 లక్షలతో పాటు బడుగుబలహీన వర్గాల అభివృద్ధి జరుగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్యాంకుమార్‌రెడ్డి, అనిల్, నిషాంత్, ముత్యంలతో పాటు మహిళా నాయకురాలు పోచమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైద్య చికిత్సలు అందడం లేదని కాంగ్రెస్ ధర్నా



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు వైద్య చికిత్సలు అందించడంలో డాక్టర్లు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని. సోమవారం నర్సాపూర్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ముందు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్బంగా టీపీసీసీ రాష్ట్ర నాయకులు ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ. నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి పేరుకు మాత్రమే వంద పడకల ఆసుపత్రి అని రోగులకు వైద్య చికిత్సలు సక్రమంగా అందించడం లేదన్నారు. దీంతో రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోగులకు ఏ చిన్న సమస్య వచ్చినా హైదరాబాద్, సంగారెడ్డి ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు నాసిరకం ఆహారం పెడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఆసుపత్రికి వచ్చి ఆందోళన కారులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్ గుప్తా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రిజ్వాన్, మండల అధ్యక్షులు మల్లేశం, ఓబీసీ సెల్ మండల అధ్యక్షులు అశోక్ గౌడ్, నాయకులు సురేష్ నాయక్ , ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ మండల పరిధిలోని ఆవంచ, మూసాపేట్, కాగజ్ మద్దూర్, సబ్ స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజ్ కమార్ సోమవారం తెలిపారు. నర్సాపూర్ పట్టణంలోని 132/33 కె.వి సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తులు చేపడుతున్నందున ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.



సీఎం రిలీఫ్ ఫండ్ ఆసరాగా నిలుస్తుంది

- ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి



నవతెలంగాణ-చేర్యాల

వైద్య చికిత్సలు చేయించుకోలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఎన్నో కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి తెలిపారు. చేర్యాల పట్టణానికి చెందిన చాట్ల ప్రసాద్‌కు సీఎంఆర్ఎఫ్ నిధి కింద మంజూరైన రూ.50 వేల చెక్కును ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలను ఆర్థికంగా ఆదుకునేందుకు కేసీఆర్ ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఆడెపు నరేందర్, నాలుగు మండలాల యూత్ ఇంచార్జ్ శివగారి అంజయ్య, రాంపూర్ సర్పంచ్ తివారి దినేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల అభివృద్ధి

- పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి
- ఎంపీటీసిల ఫోరం మండలాధ్యక్షులు రాజమైన కృష్ణ యాదవ్



నవతెలంగాణ-మర్కుక్: పట్టణాలకు దీటుగా పల్లెలు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీఎం కేసీఆర్ నేతృత్వంలో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయని ఎంపీటీసిల ఫోరం మండలాధ్యక్షులు రాజమైన కృష్ణ యాదవ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని దామరకుంట గ్రామంలో గడ నిధులు రూ.30 లక్షలతో నిర్మిస్తున్న మురికి కాలువ పనులను సర్పంచ్ మాధరి గాయిత్రి బాలనర్సయ్య, గజ్వేల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పత్తి బాబు యాదవ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సదరు కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం గ్రామంలో నూతనంగా గడ నిధులతో రూ.17 లక్షలతో నిర్మించిన మహిళా సమైక్య భవనాన్ని పరిశీలించి, పలు సలహాలు, సూచనలు చేశారు.

దేశ్ పాండే ఆధ్వర్యంలో ర్యాలీ



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు ఉన్నత పాఠశాలలో దేశ్ పాండే ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం (ఎస్ఐవి-స్కిల్ ఇన్ విలేజ్) అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఉన్నత పాఠశాల ఇంచార్జ్ ఎచ్.యం రవీందర్ రెడ్డి, దేశ్ పాండే ఫౌండేషన్ సిద్దిపేట క్లస్టర్ ట్రైనర్ మాచర్ల లావణ్య మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకత, ఆంగ్ల భాష పైన అవగాహన, సులభతరంగా ఆంగ్ల భాషను నేర్చుకోవడం వంటి వాటిపైన ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజగోపాల్ పేట ఎస్ఐవి టీచర్ గంధమల్ల యాదగిరి, గట్లమల్యాల యస్ఐవి టీచర్ గోజిగాల భాను ప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ



నవతెలంగాణ-తొగుట

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడత అందించిన ఏకరూప దుస్తులను విద్యార్థిని, విద్యార్థులకు గ్రామ సర్పంచ్ బొడ్డు నర్సింలు, ఉపాధ్యాయులతో కలిసి పంపిణీ చేశారు. సోమవారం మండలంలోని చందాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందించిన ఏకరూప దుస్తులను విద్యార్థిని, విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లు తెగిపడి పాడి గేదె మృతి



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మండలంలోని ఆకునూరు గ్రామంలో జక్కుల మల్లేశం అనే రైతుకు చెందిన పాడి గేదె విద్యుత్ వైర్లు తెగిపడి షాక్ కొట్టడంతో మృతి చెందింది. రోజు వారీగా ఆదివారం రాత్రి ఇంటికి వెళ్లేటప్పుడు విద్యుత్ వైరు తెగలేదని సోమవారం ఉదయం వచ్చి చూసేసరికి విద్యుత్ వైరు తెగిపడి దాదాపు రూ.80 వేల విలువ గల పాడి గేదె చనిపోయి ఉందని బాధితుడు మల్లేశం తెలిపారు. గేదె మృతి చెందడంతో రైతు మల్లేశం కుటుంబం ఆర్థికంగా నష్టపోయిందని ప్రభుత్వం ఆదుకుని నష్ట పరిహారం చెల్లించాలని తోటి రైతులు కోరారు.

అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు నిర్మాణం



నవతెలంగాణ-నంగునూరు

దశల వారిగా గ్రామంలోని అన్ని వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు ఎంపీటీసీ బెదురు తిరుపతి తెలిపారు. సోమవారం నంగునూరు మండలం సిద్దన్నపేట గ్రామంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి హరీశ్‌రావు సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మధు, రాజేశ్వర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రవి, నాయకులు డాకూరి భాస్కర్ రెడ్డి, మల్లేశం, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు మల్లేశం, కిష్టారెడ్డి, సంజీవరెడ్డి, రామ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కనకయ్య, పరశురాములు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మోటార్ సైకిల్ ఆటో ఢీ, ఇరువురికి గాయాలు




నవతెలంగాణ-కొండపాక

కొండపాక క్రాస్ రోడ్ వద్ద రాజీవ్ రహదారిపై మోటార్ సైకిల్‌ను ఆటో ఢీకొట్టడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే అర్జున పట్ల గ్రామానికి చెందిన తాళ్లపల్లి శ్రీనివాస్ తన కుమారుడు హర్షవర్ధన్ ను బాలుర హాస్టల్లో దింపడానికి మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా హైదరాబాద్ నుంచి సిద్దిపేటకు వెళ్తున్న ఆటో ఢీ కొట్టింది. దాంతో వారిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందడంతో 108 అంబులెన్స్ సిబ్బంది మహేందర్, రమేష్ సంఘటన స్థలానికి చేరుకొని వారికి ప్రథమ చికిత్స చేశారు. అనంతరం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చేర్పించారు. శ్రీనివాస్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

రేపు ఎస్సీ కార్పోరేషన్ ఇంటర్వూలు

నవతెలంగాణ-కోహెడ

మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రేపు ఎస్సీ కార్పోరేషన్ ఇంటర్వూలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మధుసూదన్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇదివరకు ఎస్సీ కార్పోరేషన్ కొరకు ధరఖాస్తు చేసిన వారికి రేపు ఉదయం 11 గంటలకు ఇంటర్వూలను నిర్వహిస్తున్నందున ధరఖాస్తుదారులు సంబంధిత పత్రాలతో హాజరు కావాలని సూచించారు. ఈ ఇంటర్వూలను లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-నంగునూరు

అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీటీసీ బెదురు తిరుపతి సూచించారు. సోమవారం నంగునూరు మండలం సిద్దన్నపేట గ్రామంలో అంగన్వాడి పిల్లలకు పలకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మధు, పంచాయతీ కార్యదర్శి రవి, నాయకులు డాకూరి భాస్కర్ రెడ్డి, మల్లేశం, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు మల్లేశం, అంగన్వాడి టీచర్ భవాని తదితరులు పాల్గొన్నారు.

జువ్వ కింది వంశీ హత్యకు కారకులైన వారిని వెంటనే అరెస్టు చేయాలి



నవతెలంగాణ-సిద్దిపేట

దళితులను నడిరోడ్డుపై పట్టపగలు నరికి చంపినా న్యాయం అందడం లేదని, జువ్వ కింది వంశీ హత్యకు కారకులైన వారిని వెంటనే అరెస్టు చేయాలని 57 ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు పెన్నింటి దాసు ప్రభుత్వాన్ని కోరారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగిత్యాల జిల్లా బీర్పూర్ మండల కేంద్రంలో ఎస్సీ ఉపకులమైన గోసంగి కులస్తుడు జువ్వకింది వంశీని కొందరు దుండగులు నడిరోడ్డుపై నరికి చంపారని, అన్ని ఆధారాలు ఉన్నా దుండగులను ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. నిందితులను అరెస్టు చేయకపోగా బాధితులని పోలీసులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. జువ్వ కింది వంశీ హత్యకు కారకులైన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్సీ 57 ఉపకులాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సత్య రాజు, బుజంగం రవి, నాగరాజు, బాలాజీ, గణేష్, మధు, వెంకట్ పాల్గొన్నారు.

నేను ఎక్కడ గజం భూమి కబ్జా చేయలే

- దమ్ముంటే చర్చకు రా ఎమ్మెల్యే ముత్తిరెడ్డికి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి సవాల్
- నాపై ఎమ్మెల్యే చేసిన ఆరోపణలను ఖండిస్తున్నా
- ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ఎమ్మెల్యే మొసలి కన్నీరు

నవతెలంగాణ-చేర్యాల

నేను ఎక్కడ గజం భూమి కబ్జా చేయలేదని, దమ్ముంటే చర్చకు రావాలని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డికి మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి సవాల్ విసిరారు. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి తనపైన చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. చేర్యాల మండల కేంద్రంలోని తన నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రతాప్ రెడ్డి మాట్లాడారు. తన తండ్రి కబ్జా చేశాడని ఎమ్మెల్యే కూతురు తుల్జా భవాని రెడ్డి ఆరోపిస్తుంటే ఆ ఆరోపణలతో తనకేమిటి సంబంధమని, ఈ సమస్యను నువ్వు నీ కూతురుతో మాట్లాడి పరిష్కరించుకోవాలన్నారు. కానీ తాను ఏదో చేశానని తనపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. చేర్యాల పట్టణంలో 30 ఎకరాల వెంచర్ చేశానని అనడం అవాస్తవమని, తాను, తన కుటుంబ సభ్యులు కలిసి 16 ఎకరాలలో ప్లాట్లు చేసామని, అందులో ప్లాట్లు కొనుక్కున్నవారు చాలా సంతోషంగా ఉన్నారని తెలిపారు. 16 ఎకరాల వెంచర్ చేస్తే చట్టబద్ధంగా తాను 4800 గజాలు గ్రామ పంచాయతీకి ఇవ్వాలి కానీ ఇక్కడ జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారి విస్తరణ కోసం ఎకరం 20 గుంటలు, బొంగు సురేందర్ రెడ్డి ఇంటి నుంచి ఒగ్గు రాజు ఇంటి వరకు రైతులు పొలాలకు వెళ్లడానికి 20 గుంటల భూమిని ఇచ్చానని, ఇవ్వవలసిన దానికంటే ప్రజల సౌకర్యం కోసం రెట్టింపు భూమిని ఇచ్చానన్నారు. ఎక్కడ కూడా గజం జాగా కబ్జా చేయలేదన్నారు.

సిడిఎఫ్ నిధుల వినియోగంపై శ్వేత పత్రం విడుదల చేయాలి

తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజకవర్గ అభివృద్ధి నిధులతో ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టానని ప్రస్తుత ఎమ్మెల్యే స్థానికేతరుడు కావడం తోనే సిడిఎఫ్ నిధులతో గ్రామాలను అభివృద్ధి చేయడం లేదని, సిడిఎఫ్ నిధుల వినియోగంపై దమ్ముంటే శ్వేత పత్రం విడుదల చేసి ఎమ్మెల్యే చర్చకు రావాలన్నారు.

సొంత డబ్బులతో స్మశాన వాటిక నిర్మిస్తా

గతంలో ముస్త్యాల అరుణ సర్పంచ్‌గా ఉన్న సమయంలో తన దగ్గరికి గ్రామ పెద్దలు వచ్చి స్మశాన వాటిక నిర్మాణం కోసం ఎకరం స్థలం కావాలని చెప్పడంతో తాను కొని తన పేరిట చేసుకుని దానిని మున్సిపల్ పేరిట చేద్దామనే సమయంలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అడ్డుపడి కొమ్మూరి ప్రతాపరెడ్డి కొనిస్తే మంచి పేరు వస్తుందని భావించి ఆ స్థలం తీసుకోవద్దని చెప్పడంతో అప్పటి నాయకులు ఎవరూ ముందుకు రాలేదని, బల్ల గుద్ది మరీ చెబుతున్న ఆ జాగాలో సొంతంగా చేర్యాల పట్టణ ప్రజల కోసం స్మశాన వాటిక నిర్మించి ఇస్తానని కొమ్మూరి ప్రతాప్ రెడ్డి తెలిపారు.

నమ్మకద్రోహం చేసి నన్ను సస్పెండ్ చేయించావు

తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చేర్యాల మండల పరిధిలోని పెద్దరాజుపేట గ్రామంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు సమయంలో టీఆంఎస్ ఫ్లెక్సీలను ఎమ్మెల్యే తగలబెట్టి అవి నేనే తగలబెట్టానని అధిష్టానానికి చెప్పి తనను పార్టీ నుంచి సస్పెండ్ చేయించిన ఘనుడివని, తప్పకుండా చేర్యాల ప్రాంత ప్రజలు ఎన్నికల్లో బుద్ధి చెప్తారని, ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డికి టికెట్ రాక పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డికి ఇస్తున్నారని తెలిసి నియోజకవర్గంలో ఇష్టారాజ్యాంగ వ్యవహరిస్తున్నాడని ప్రతాప్ రెడ్డి అన్నారు. ఈ ఎన్నికల్లో జనగామ నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో అఖండ విజయం సాధిస్తానన్నారు. ఈ సమావేశంలో పిఎసిఎస్ మాజీ చైర్మన్ ఉడుముల బాల్ రెడ్డి, జిల్లేల సిద్దారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కాటం మల్లేశం, సీనియర్ నాయకులు మంజ మల్లేశం, యూత్ జనగామ జిల్లా అధ్యక్షుడు శివరాజ్ యాదవ్, రాగుల శ్రీనివాస్ రెడ్డి, వెలుగల దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు



10,11,12న జరిగే టోకెన్ సమ్మె జయప్రదం చేయాలి




నవతెలంగాణ-కొండపాక

మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన విధంగా వేతనాలను పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు దాసరి కళావతి, జిల్లా కమిటీ సభ్యులు అమ్ముల బాల్ నర్సయ్య డిమాండ్ చేశారు. సోమవారం మధ్యాహ్న భోజన కార్మికులు ఎంఈఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి కార్యాలయ ఎంఐఎస్ కోఆర్డినేటర్ మల్లేయ సురేందర్‌కు సమ్మె నోటీస్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కళావతి, అమ్ముల బాల్ నర్సయ్య మాట్లాడుతూ జీవో నెంబర్ 8 ప్రకారం జీతం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్రకు ఇవ్వడాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 2022 మార్చి 15న అసెంబ్లీలో మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.2000 పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించి గాలికి వదిలేశారన్నారు. దాంతో అనేక పోరాటాలు చేసిన ఫలితంగా 2023 ఫిబ్రవరి 3న జీవో నెంబర్ 8 విడుదల చేయడం జరిగిందన్నారు. నేటికీ పెంచిన వేతనం ఏరియర్స్ ఇవ్వడంలో ప్రభుత్వం జాప్యం చేస్తుందని మండిపడ్డారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలన్నారు. గుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించి, అవసరమైన గ్యాస్‌ను సబ్సిడీ ద్వారా అందించాలన్నారు. అక్రమ తొలగింపులు, రాజకీయ వేధింపులు అరికట్టాలన్నారు. కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. జులై 10, 11,12 తేదీలలో జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. 14 వరకు ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మెకు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముక్కెర బాల్ నర్సయ్య, కాస రమేష్, బైరెడ్డి ఇలా రెడ్డి నీల, కొమ్ము పద్మ, గజ్వేల్ లక్ష్మి,గుర్రాల కవిత,ఎల్ల గారి వనిత, దయ్యాల రేణుకపెద్ద సాయి గారి పుష్ప, మల్లోజి భూలక్ష్మి, వేముల యాదవ్వ, జంజరపు రాజవ్వ, ఎల్లవ్వ, లలిత, రాచకొండ కళగైని అరుణ, జాలిగామ మల్లవ్వ, ఎర్రబోయిన మల్లవ్వ, పాల్గొన్నారు.

అవినీతికి అడ్డా కాంగ్రెస్

- కాంగ్రెస్ అధికారం వస్తే సీఎం ఎవరో చెప్పాలి
- ఎఫ్‌డీసీ చైర్మెన్ వంటేరు ప్రతాపరెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అవినీతి అక్రమాలకు కాంగ్రెస్ అడ్డగా మారిందని తెలంగాణ ఫారెస్ట్ చైర్మన్ ఒంటేరు ప్రతాపరెడ్డి అన్నారు. సోమవారం నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులతో గజ్వేల్‌లో సీఎం మినీ క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. అడుగడుగునా కబ్జాలకు పాల్పడ్డ కాంగ్రెస్ ఇప్పుడు అధికారం కోసం నానా తంటాలు పడుతుందన్నారు. కాంగ్రెస్ హయాంలో ముఖ్యమంత్రితో పాటు ఎమ్మెల్యేలు మంత్రులు అవినీతికి పాల్పడి జైలుకు వెళ్లిన సంఘటనలు రాహుల్ గాంధీకి గుర్తు లేవా అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ చేసిన పాపానికి ఐఏఎస్లు ఐపీఎస్లు జైలు కూడు తిన్నారని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని రేవంత్ రెడ్డి రాసిచ్చిన స్క్రిప్టును రాహుల్ గాంధీ చదివి వినిపించారన్నారు. కాంగ్రెస్ అధికారం వస్తే ముఖ్యమంత్రి ఎవరో చెప్పాలన్నారు. బీజేపీ పరిపాలించే రాష్ట్రాల్లో ప్రజలకు తినటానికి తిండి కూడా లేదన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల్లో ఎవరు ముఖ్యమంత్రి అవుతారో వాళ్ళు ఎంత కాలం ఉంటారో తెలియని పరిస్థితి ఉందన్నారు. బిజెపి కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకునేందుకు కుట్రలు కుతంత్రాలు చేస్తున్నారన్నారు. తెలంగాణ సంక్షేమం కోసం గత తొమ్మిది సంవత్సరాలుగా ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. జాతీయ పార్టీకి నాయకత్వం వహిస్తున్న రాహుల్ గాంధీ కాళేశ్వరం ప్రాజెక్టుకు ఖర్చయింది 80 వేల కోట్లు అయితే లక్ష కోట్లు అవినీతి జరిగిందని చెప్పడం సిగ్గుచేటు అన్నారు. రాహుల్ గాంధీకి అసలు ప్రాజెక్టుల మీద అవగాహన లేదన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి, తెలంగాణ రాష్ట్ర రైతు సమితి సభ్యులు దేవి రవీందర్, ఆత్మ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు చంద్రమోహన్ రెడ్డి, జెడ్పిటిసిలు పంగ మల్లేశం, మంగమ్మ రామచంద్రం, దుర్గయ్య, నాయకులు కర్ణాకర్ రెడ్డి, బెండ మధు, కుర్ర సాయి రెడ్డి, నూనె కుమార్ యాదవ్, కిషన్ రెడ్డి, గుంటుక రాజు, రామకృష్ణారెడ్డి, ఇంద్రసేనారెడ్డి, ఆరె పెంటయ్య, నవాజ్ మీరా తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగం, ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వ అలసత్వం

- పదోన్నతులు, బదిలీలు వెంటనే చేపట్టాలి
- ఎమ్మెల్సీ ఏవిఎన్ రెడ్డి



నవతెలంగాణ-సిద్దిపేట

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పట్ల, విద్యారంగం అభివృద్ధి పట్ల అలసత్వం ప్రదర్శిస్తూ విద్యారంగాన్ని సమస్యల నిలయంగా మార్చిందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవిఎన్ రెడ్డి అన్నారు. సోమవారం రెడ్డి సంఘంలో నిర్వహించిన తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక రంగదాంపల్లి చౌరస్తాలో ఉన్న అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించిన అనంతరం జిల్లా అధ్యక్షులు ఊడెం రఘువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, విద్యారంగ అభివృద్ధికి ఉపాధ్యాయులు ప్రభుత్వ నిద్రమత్తును తొలగిస్తారన్నారు. ఉపాధ్యాయుల వెంటే ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమిస్తానన్నారు. పదోన్నతులు బదిలీలు లేక ఐదు సంవత్సరాలుగా ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారని, ఎలాంటి పదోన్నతులు లేకుండానే ఉద్యోగ విరమణ జరిగే పరిస్థితులు తెలంగాణలో ఏర్పడ్డాయన్నారు. మన నుండి విడిపోయిన పక్క రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు రెండుసార్లు పదోన్నతులు, బదిలీలు నియామకాలు చేపట్టారని, తెలంగాణ రాష్ట్రంలో బదిలీలు, పదోన్నతులు నియామకాల ఊసే లేదన్నారు. ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పిఆర్సి బకాయిలు పిఆర్సి కాలం ముగిసినా చెల్లించలేని స్థితిలో తెలంగాణ ప్రభుత్వం ఉందన్నారు. అన్నింటిని వాయిదాల రూపంలో చెల్లిస్తూ ఉపాధ్యాయులకు ఆర్థిక సమస్యలు సృష్టిస్తుందన్నారు. మండల విద్యాధికారుల ఖాళీల మూలంగా విద్యారంగ పర్యవేక్షణ లోపించి నాణ్యమైన విద్య అందడం లేదన్నారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తే సమస్యల పరిష్కారం జరిగి, కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండేది కాదన్నారు. ధనిక రాష్ట్రమైన తెలంగాణ దేశంలోనే విద్యారంగానికి బడ్జెట్లో ఏడు శాతం కేటాయింపులతో చివరి స్థానంలో నిలిచిందన్నారు. ఇంత తక్కువ కేటాయింపులతో పిల్లలకు నాణ్యమైన విద్య అందించడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. ఇంత తక్కువ కేటాయింపులతో విద్య రంగాన్ని విస్మరించిన ప్రభుత్వం బంగారు తెలంగాణను ఎలా సాధ్యం చేస్తుందన్నారు. విద్యారంగాన్ని విస్మరించిన సమాజం పురోగతి సాధించినట్లుగా చరిత్రలో లేదని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తించి విద్యారంగ కేటాయింపులు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ప్రారంభించిన అంబలి పంపిణీ కార్యక్రమం ఎక్కడ అమలు కావడం లేదని, ప్రచారం కోసం మాత్రమే ప్రారంభించి వదిలేశారన్నారు. 37 జీవోలో స్థానికేతరులుగా మారిన ఉపాధ్యాయుల సమస్యలను, పరిష్కార మార్గాలను చర్చించడానికి ముఖ్యమంత్రికి తీరిక దొరకడం లేదన్నారు. ఈ సందర్భంగా జిల్లా, రాష్ట్ర బాధ్యులు ఆయన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలపై స్పందిస్తూ రాబోవు వర్షాకాల సమావేశాల్లో రెండవ పిఆర్సి ఏర్పాటు చేయడంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించి పి ఆర్ సి కమిటీ వేసి మధ్యంతర భృతి ప్రకటించే విధంగా కృషి చేస్తానన్నారు. తపస్ రాష్ట్ర అధ్యక్షులు హనుమంతరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికలకు ఇచ్చినంత ప్రాధాన్యత విద్యారంగ అభివృద్ధికి ఇవ్వడం లేదన్నారు. ఎన్నికల సమయంలో అనేక వాగ్దానాలు చేస్తూ, ఎన్నికలు కాగానే పట్టించుకోకపోవడం దురదృష్టకరమని అన్నారు. ప్రముఖ కవి, సామాజిక ఉద్యమకారుడు భాస్కర యోగి మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుని పాత్ర ఎంతో కీలకమైనదని, అనాదిగా గురువుకు సమాజంలో ఎనలేని గౌరవం ఉందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీని, సామాజిక ఉద్యమకారుడు భాస్కరయోగిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు తిరుపతి, శ్రీనాకర్ రెడ్డి, జనార్ధన్, నర్సిరెడ్డి, మహేందర్ రెడ్డి, జిల్లా బాధ్యులు ఊడెం రఘువర్ధన్ రెడ్డి, మురళి, శశి కుమార్ లు, మండల బాధ్యులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్పంచ్‌పై వాటర్‌మెన్ ఫిర్యాదు



నవతెలంగాణ-మద్దూరు: చేర్యాల మండలంలోని కమలాయపల్లి గ్రామ సర్పంచ్ ఓరుగంటి అంజయ్యపై వాటర్‌మెన్ జక్కుల ఎల్లయ్య మద్దూరు ఎంపీ ఓ ఖాజా మోయునుద్దిన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వాటర్ మెన్ జక్కుల ఎల్లయ్య మాట్లాడుతూ కమలాయపల్లి గ్రామంలో 1997 నుంచి వాటర్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న తనను అకారణంగా సర్పంచ్ తనపై కొన్ని నిందలు మోపుతూ నువ్వు వాటర్ మెన్‌గా చేయవద్దని బెదిరిస్తున్నాడని ఆయన తెలిపారు, సర్పంచ్ తనను అకారణంగా వాటర్‌మెన్ విధులకు రావద్దని చెప్పడంతో సర్పంచ్‌పై ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీఓ ఖాజా మొయినుద్దీన్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. తనను తిరిగి వాటర్‌మెన్‌గా నియమించాలని, లేనిపక్షంలో ఆత్మహత్యే శరణ్యమని ఆయన తెలిపారు.

నూతన హంగులతో సర్కార్ బడులు

- ప్రాథమిక పాఠశాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే రసమయి



నవతెలంగాణ-బెజ్జంకి:

నూతన హంగులు, సకల సౌకర్యాలతో పాఠశాల భవనాలను నిర్మిస్తూ సర్కార్ చదువులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మన ఊరు-మన బడి కార్యక్రమంలో మండల కేంద్రంలో సుమారు రూ.73.5 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవన్ని సోమవారం ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ప్రత్యేక నిధులతో నిర్మించిన ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంపోందిం చేలా గ్రామంలోని ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, యువత ప్రధాన భూమిక పోషించాలని ఎమ్మెల్యే రసమయి సూచించారు. విద్యార్థుల చదువులకు ఆటంకం ఏర్పడకుండా పాఠశాల భవనాన్ని త్వరితగతిన పూర్తి చేసిన గుత్తేదారు బాలయ్యను ఎమ్మెల్యే శాలువా కప్పి సన్మానించారు. అనంతరం ప్రజాప్రతినిధులు విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. గురుపౌర్ణమి సందర్భంగా ఎమ్మెల్యే సాయి బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ నిర్మల, జెడ్పీటీసీ కవిత, సర్పంచ్ మంజుల, ఎంపీటీసీ శారధ, ఎంపీడీఓ రాము, ఎంఈఓ పావని, అయా గ్రామాల సర్పంచు లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ అనుబంధ కమిటీల నాయ కులు, ప్రధానోపాధ్యా యులు శంకర చారి, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాసర ట్రిబుల్ ఐటీకి 40 మంది విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ-నంగునూరు: బాసర ట్రిబుల్ ఐటీ ప్రవేశాలకు సోమవారం వెలు వడిన ఫలితాల్లో నంగునూరు మండలం నుంచి 40 మంది విద్యార్థులు ఎంపికైనట్లు మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ నంగు నూరు ఉన్నత పాఠశాల నుంచి 13 మంది, మోడల్ స్కూల్ అక్కెనపల్లి నుంచి 11 మంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అంక్షాపూర్ నుంచి 6 మంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నర్మెట్ట నుంచి ఐదుగురు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మగ్దుంపూర్ నుంచి నలుగురు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గట్ల మల్యాల నుంచి ఒక్కరు మొత్తం 40 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ఎంఈవో దేశిరెడ్డి తెలిపారు.

బాసర ఐఐఐటిలో మెరిసిన చేబర్తి అణిముత్యం



నవతెలంగాణ-మర్కుక్: మండల పరిధిలోని చేబర్తి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో 9.8 జీపీఏ సాధించిన విద్యార్థి పోయిల మహేష్ బాసర ఐఐఐటి లో సీటు సాధించా డు. దీంతో పాఠశాల ఉపాధ్యా యులు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తంచేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు సృజనాత్మక కలిగి ఉంటారని ఉపాధ్యాయులు తెలిపారు.

నవతెలంగాణ

గజ్వేల్‌లో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్‌లో సోమవారం గురు పౌర్ణమి సందర్భంగా ఆలయాలకు పోటెత్తిన భక్తులు హౌసింగ్ బోర్డ్‌లోని సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే లక్ష్మీ ప్రసన్న నగర్ కాలనీలో సాయి బాబా మందిరంలో సాయిబాబా విగ్రహానికి ప్రత్యేక అలంకరణ చేసి అన్న దాన కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్ప దేవాలయంలో అయ్యప్ప దేవాలయం కమిటీ చైర్మన్ ఎర్రం శ్రీనివాస్ ఆధ్వర్యంలో దత్తాత్రేయ స్వామికి పంచామృత అభిషేకం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మృతుల కుటుంబాలకు బియ్యం అందజేత



నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మండల కేంద్రంలో ఇటీవల రాగుల కనకయ్య, తేలు వెంకటయ్యలు మరణించిన విషయం తెలుసుకున్న జగదేవపూర్ తెరాస గ్రామ శాఖ అధ్యక్షులు, నాచారం డైరెక్టర్ బుద్ద నాగరాజు వారి కుటుంబాలను పరామర్శించి కుటుంబానికి 50 కిలోల చొప్పున సన్న బియ్యాన్ని, ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఉప్పసర్పచ్ ల ఫోరమ్ మండల అధ్యక్షుడు బింగి మల్లేష్, బుద్ద సత్యం, సడల కర్ణాకర్, బత్తిని శ్రీనివాస్,శివాజీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

గురుదేవుని భారీ చిత్రాన్ని చిత్రించి ఆవిష్కరణ.



నవతెలంగాణ- గజ్వేల్

శ్రీరామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో గురుపౌర్ణమి పురస్కరించుకుని మనకు జ్ఞానాన్ని అందించే గురుదేవుని భారీ అద్భుత చిత్రాన్ని ఆవాలతో చిత్రించి సోమవారం రామకోటి కార్యాలయంలో ప్రత్యేకంగా పూజలు జరిపిన అనంతరం ఆవిష్కరించారు గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షులు, రాష్ట్రస్థాయి కళారత్న అవార్డ్ గ్రహీత రామకోటి రామరాజు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ అజ్ఞానమనే చీకటి వల్ల మూసుకుపోయిన కళ్ళను జ్ఞామనే వెలుగులోకి ప్రకాశింపజేసే అతనే గురువు అన్నారు. జ్ఞాన బిక్షతో పునర్జన్మనిచ్చి జీవితానికి స్వార్ధకత నిచ్చే మహా నీయుడే గురువు. తల్లిదండ్రులు ఇచ్చిన ఈ జన్మకు "గురువు" తోడయ్యాక, ఈ ప్రపంచంలో నీ కంటూ ఒక స్థానం. ముక్కోటి దేవతల రూపమే ఈ గురువు అన్నారు. తిలకించిన భక్తులు ఈ చిత్రం అద్భుతంగా ఉందని కొనియాడారు. ఈ చిత్రం భక్తుల దర్శనార్థం 2రోజుల పాటు రామకోటి కార్యాలయంలో ఉంచబడునన్నారు.

గురుపౌర్ణమి సందర్భంగా సాయి బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-దుబ్బాక రూరల్

గురుపౌర్ణమి సందర్భంగా చిట్టాపూర్ సాయి బాబా ఆలయంలో ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అక్బర్ పేట భూంపల్లి మండల పరిధిలోని చిట్టాపూర్‌లో గురు పౌర్ణమి సందర్భంగా సాయి బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు , అర్చనలు, హారతిలు చేశారు. అనంతరం భక్తులందరికీ తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

అంగన్వాడీ కేంద్రంల్లో కనీస సౌకర్యాలను కల్పించాలి

- డిబిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు



నవతెలంగాణ -వర్గల్

మండల కేంద్రంలోని నాల్గవ అంగన్వాడి కేంద్రానికి చుట్టూ ప్రహరీ గోడ లేడలేకపోవడంతో పిల్లలు భయభ్రాంతులకు గురవుతున్నారని డిబిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాన్నికి చుట్టూ ప్రహరీ కూడా లేకపోవడంతో పాములు వచ్చే అవకాశం ఉన్నందున అంగన్వాడీ పరిసరాలు ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. కనీసం త్రాగునీటి సౌకర్యం లేకపోవడంతో చుట్టూ పక్కన ఉన్న ఇండ్లలో నీళ్లు పట్టుకొచ్చే పరిస్థితి ఉన్నది. వర్గల్ మండల కేంద్రంలోని ఉన్న నాలుగు అంగన్వాడి సెంటర్లకు మరుగుదొడ్లు లేకపోవడంతో పిల్లలు,అంగన్వాడి టీచర్లు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ప్రభుత్వం అంగన్వాడి కేంద్రానికి చుట్టూ ప్రహరీ గోడ, నీటి సౌకర్యం, మరుగుదొడ్లను, కనీస సౌకర్యాలకై నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు

సమాజ సేవలో లైన్స్ క్లబ్



నవతెలంగాణ- గజ్వేల్

సమాజ సేవ లో లైన్స్ క్లబ్ ముందు ఉంటుందని గజ్వేల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన లయన్ నేతి శ్రీనివాస్ అన్నారు. ప్రమాణస్వీకారం ఆదివారం రాత్రి ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా గజ్వేల్ ప్రాంతంలో సేవలు అందిస్తుందని ఆయన గుర్తు చేశారు. రీజియన్ చైర్మన్ గుడాల రాధాకృష్ణ, రీజియన్ సెక్రెటరీ సంజయ్ గుప్తా, లయన్ రామ్ ఫనిధర్,లయన్ పరమేశ్వర చారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, మల్టిపుల్ కౌన్సిల్ సెక్రటరీ లయన్ గంధాని శ్రీనివాస్,లయన్ శ్యామ్ కుమార్,లయన్ మామిడాల శ్రీనివాస్, లయన్ మర్రి ప్రవీణ్,డాక్టర్ లింగం,పాల్గొని నూతనంగా ఏర్పాటైన మహిళ క్లబ్ లయన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ మహతితో పాటు మరో అయిదు లయన్స్ క్లబ్స్ లయన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ స్నేహ, లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రజ్ఞ, లయన్స్ క్లబ్ ఆఫ్ జగదేవపూర్ మిత్ర, లయన్స్ క్లబ్ ఆఫ్ మేధ, లయన్స్ క్లబ్ ఆఫ్ రాయపోల్, లయన్స్ క్లబ్ చైర్మన్లు, డైరెక్టర్లు, సభ్యులతో వారు ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా లయన్స్ క్లబ్ సేవలు విస్తృత స్థాయిలో నిర్వహించి ప్రజల మన్నన పొందుతుందని గజ్వేల్ ప్రాంతంలో లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని, నూతనంగా ఏర్పాటైన మహిళ క్లబ్ గజ్వేల్ మహతి సభ్యులకు, మిగతా క్లబ్ బృందానికి అభినందనలు తెలిపారు. లయన్స్ క్లబ్ సేవలు విస్తృతపరచాలని మరింత సేవ చేస్తూ ప్రజల మన్నన పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య, నాచారం దేవస్థానం డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ, కొండపోచమ్మ డైరెక్టర్ గోలి సంతోష్, ఏఎంసి డైరెక్టర్ సయ్యద్ మతీన్, ఇటిక్యాల సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్ హైదర్ పటేల్, ఎల్లం రాజు, నాగేందర్, లయన్స్ క్లబ్ ఆఫ్ మహతి అధ్యక్షురాలు సుమలత, లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షులు నేతి శ్రీనివాస్, లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రజ్ఞ అధ్యక్షులు పరమేష్, లయన్స్ క్లబ్ ఆఫ్ జగదేవపూర్ అధ్యక్షులు నాగరాజు, లయన్స్ క్లబ్ ఆఫ్ రాయపోల్ అధ్యక్షులు ఏలియాస్ రావు, లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డైట్ చార్జీలను పెంచి హామీని నిలబెట్టుకోవాలి

- డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్



నవతెలంగాణ-గజ్వేల్

హస్టల్, గురుకుల విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం నుంచే డైట్ చార్జీలు పెంచి అమలు చెస్తామనే రాష్ట్ర ప్రభుత్వ హమిని నిలబెట్టుకొవాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. సోమవారం గజ్వేల్‌లోని గిరిజన హస్టల్ ను సందర్శించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మంత్రి వర్గ ఉపసంం సిఫార్సుల ప్రకారం డైట్ చార్జీల పెంపుదలకు ప్రభుత్వం నిర్ణయించిన అప్పటికి అమలు చేయకపొవడం తగదన్నారు. గత ఏడు సంవత్సరాలుగా మెస్, కాస్మోటిక్, మెస్ చార్జీల పెంపుపై ప్రభుత్వం సవతితల్లి ప్రేమ చూపిస్తుందన్నారు. వెంటన్ పెంచిన చార్జీలను అమలు చెసి విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్నారు. గజ్వేల్ గిరిజన హస్టల్‌లోని కొన్ని బాత్ రూమ్ లలో నల్లాలు లేవని, నీటి సరఫరా లేదన్నారు. వెనుక భాగంలో ప్రహరీ గోడ లేక పొవడం వల్ల పాములు వచ్చె ప్రమాదం వున్నందున ప్రహరీగోడ నిర్మించాలని డిమాండ్ చేశారు. భవనం శిధిలావస్థకు చెరినందున హస్డల్ ను ఎడ్యుకేషన్ హబ్‌కు తరలించాలన్నారు. విద్యార్థులకు ట్యూషన్ పట్టణంలో కాకుండా హస్టల్‌లోనే చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఎగొండ స్వామి,డిబిఎఫ్ జిల్లా ప్రధాన కార్య దర్శి బ్యాగరి వేణు,నాయకులు ప్రభాకర్ లు పాల్గొన్నారు.

ఎంపీ ప్రభాకర్ రెడ్డిని కలిసిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-చేగుంట: చేగుంట బీఆర్ఎస్ నాయకులు మెదక్ పార్లమెంటు సభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డిని ఆయన నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో సన్మానించారు. చేగుంటలో శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి గుడి నిర్మాణం కోసం తమ వంతు సహాయం అందించాలని నాయకులు కోరగా, తప్పకుండా గుడి నిర్మాణం కోసం సాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు మంచి కట్ల శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షులు తాడెం వెంగళరావు, డిష్ రాజు, పుల్లబోయిన రవి, కోఆప్షన్ సభ్యులు రవి, లింగం, వెంకటి, సిద్ధులు, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

వ్యాసమహర్షి యోగ సెంటర్ లో గురుపూజోత్సవం



నవతెలంగాణ-సిద్దిపేట

గురు పౌర్ణమి, వ్యాస పూర్ణిమ సందర్భంగా వ్యాస మహర్షి యోగ సొసైటీ ఆధ్వర్యంలో యాసమహర్షి యోగ సెంటర్ సిద్దిపేటలో గురుపూజోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న చెప్పల హరినాథ శర్మ వ్యాస మహర్షి యొక్క గొప్పతనాన్ని, ఔన్నత్యాన్ని కొనియాడారు. వ్యాసాయ విష్ణురూపాయ విష్ణు రూపాయ వ్యాసయే విష్ణు భగవానుడే వేదవ్యాస మహర్షి రూపంలో ఈ భూమిపై అవతరించాడని అన్నారు. గురు పరంపరలో భాగంగా వ్యాస మహర్షి పుట్టిన రోజు అయిన ఆషాడ పౌర్ణమి రోజును గురు పౌర్ణమి దినోత్సవంగా నిర్వహించామన్నారు. అలాంటి గొప్ప కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వ్యాసమహర్షి యోగ సొసైటీ కార్యవర్గానికి అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. సంగీతంలో శశిధర శర్మ, విద్యా ఉద్యోగ ఉపాధ్యాయ మహిళా తరుణి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు లక్కిరెడ్డి విజయ, విద్య,యోగ రంగంలో గంగాపురం శ్రీనివాస్, డ్యాన్స్ నృత్యం విభాగంలో భవానిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి, వ్యాస మహర్షి యోగా సొసైటీ అధ్యక్షులు నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు తోట అశోక్, జిల్లా యోగ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కొమురవెల్లి అంజయ్య, చీఫ్ ప్యాట్రన్ చిప్ప ప్రభాకర్, యోగ శిక్షకులు తోట సతీష్, సంధ్య, అభ్యాసకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షుడిగా కొండి మల్లారెడ్డి



నవతెలంగాణ-సిద్దిపేట: తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షుడిగా సిద్దిపేటకు చెందిన ప్రముఖ కవి, రచయిత కొండిమల్లారెడ్డి ఎన్నికయ్యారు. కరీంనగర్ ఫిల్మ్‌భవన్ లో జరిగిన రాష్ట్ర సర్వ సభ్య సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాకు చెందిన పర్కపెల్లి యాదగిరి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, ఉప్పల పద్మ సడాకుల కిషన్ రాష్ట్ర కార్యదర్శులుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వెన్నెల సాహితీ సంగమం బాధ్యులు వంగర నరసింహారెడ్డి, అశోకరాజు, మహమూద్ పాషా, రాంచంద్రరావు, గాలిరెడ్డి, త్రివిక్రమశర్మ, మోహన్, మహిపాల్, మహేందర్, పిడిశెట్టిరాజు, ఉప్పలపద్మ, ఉమాశంకర్, యేసురాజు, తదితరులు అభినందనలు తెలియజేశారు. సాహిత్య విలువలను పెంపొందిస్తూ, తెలంగాణ భాషా, సంస్కృతుల వికాసానికి కృషి చేస్తూ, సంఘాన్ని పటిష్టం చేయాలని వారు కోరారు.

గురువు దైవంతో సమానం



నవతెలంగాణ-సిద్దిపేట

గురువు దైవంతో సమానమని ఎన్జీవో భవన్ అధ్యక్షుడు కడవేర్గు శ్రీనివాస్ అన్నారు. గురు పౌర్ణమి వేడుకలు సిద్దిపేట ఎన్జీవో భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాస మహర్షి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పతంజలి యోగ శిక్షకుడు పెద్ది మనోహర్, హార్ట్ ఫుల్ నేస్ సంస్థ యోగ శిక్షకుడు నగేష్, యోగ శిక్షకులు బొజ్జ అశోక్, ఐత అంజయ్య. డా. కృష్ణ మూర్తి లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నిమ్మ సురేందర్ రెడ్డి, శ్రీహరి, జూలురి రవి, కనకరాజు, చేర్యాల గోపికృష్ణ, తిప్పర్తి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో సర్టిఫికెట్‌ల పరిశీలన



నవతెలంగాణ-నంగునూరు: నంగునూరు మండలం రాజగోపాల్ పేట పాలిటెక్నిక్ కళాశాలలో పాలీసెట్, ఇంజినీరింగ్ ప్రవేశం కోసం సోమవారం సర్టిఫికేట్‌లను పరిశీలించినట్లు రాజగోపాల్ పేట ప్రిన్సిపాల్, కోఆర్డినేటర్ సూర్యనారాయణ తెలిపారు. ఐదో రోజు 85 మంది హాజరయ్యారు. నేటి వరకు సర్టిఫికెట్‌ల పరిశీలన కొనసాగుతోందన్నారు. కౌన్సెలింగ్ హాజరయ్యే విద్యార్థులు కళాశాలలో చేరేందుకు ముందుగా ఆప్షన్లు పెట్టుకోవాల న్నారు. ఈ కార్యక్రమంలో సారంగపాణి,నితిన్ పవార్, సంధ్యారాణి,శ్రీనివాస్, విజయ్ కుమార్, కవిత, వైదేయి,రాజమౌళి,జ్యోతి, రాజు పాల్గొన్నారు.

పోడు పట్టాల పంపిణీ గడువులోపు పూర్తి కావాలి



- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

పోడు పట్టాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేసి, నిర్దీత గడువులోపు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లాల కలెక్టర్లకు సూచించారు. పోడు పట్టాల పంపిణీ, గృహ లక్ష్మి, ఎరువులు, విత్తనాల నిల్వలు, కస్టమ్ మిల్లింగ్, హరితహారం, బీ.సీలకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం, హౌస్ సైట్స్ పంపిణీ, తదితర అంశాలపై సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సి.ఎస్ సమీక్షించారు. పోడు పట్టాల పంపిణీలో జాప్యానికి తావులేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వారం రోజుల్లోపు అన్ని జిల్లాలలో పట్టాల పంపిణీ పూర్తి చేయాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తేవాలని సూచించారు. లబ్దిదారులకు రైతు బంధు ప్రయోజనం చేకూర్చేందుకు వారి బ్యాంకు అకౌంట్ వివరాలను సేకరించాలన్నారు. గృహలక్ష్మి పథకం కింద దరఖాస్తులను సేకరించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సీ.ఎస్ కలెక్టర్లకు సూచించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో రైతులకు ఎక్కడ ఎరువులు, విత్తనాల కొరత తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎరువుల నిల్వల గురించి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరపాలన్నారు. అర్హులైన వారికి హౌజ్ సైట్ స్థలాల పంపిణీని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. రైస్ మిల్లులకు సీఎంఆర్ కింద కేటాయించిన ధాన్యాన్ని నిర్దిష్ట గడువులోగా మిల్లింగ్ జరిపి బియ్యం నిల్వలు గోడౌన్‌లకు చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. జిల్లా అధికారులతో పాటు తహసీల్దార్లు రైస్ మిల్లులను సందర్శించి కేటాయించిన ధాన్యం నిల్వలు ఎంత, వాటిలో ఎంత ధాన్యం మిల్లింగ్ జరిపారు, ఇంక మిగిలిన ధాన్యం అందుబాటులో ఉందా లేదా అన్నది స్టాక్ రిజిస్టర్ ఆధారంగా క్షేత్ర స్థాయిలో పరిశీలన జరపాలని ఆదేశించారు. నిర్దీత గడువులోపు కస్టమ్ మిల్లింగ్ రైస్ అందించాల్సిందేనని సీ.ఎస్ స్పష్టం చేశారు. తెలంగాణకు హరితహారం కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ పూర్తి స్థాయి లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటేలా చొరవ చూపాలన్నారు. రోడ్లకు ఇరువైపున, చెరువులు, కాల్వ గట్లపైన, ఇరిగేషన్ భూములు, అటవీ ప్రాంతాలు, ఖాళీ ప్రదేశాల్లో విరివిగా మొక్కలు నాటేలా గుంతలు తవ్వించాలని సూచించారు. వర్షం అనుకూలించిన వెంటనే మొక్కలు నాటేందుకు అన్ని విధాలుగా సన్నద్ధం అయి ఉండాలన్నారు. బీ.సీలకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం, గొర్రెల పంపిణీ తదితర పథకాల అమలు తీరు, ప్రగతిని సమీక్షిస్తూ ఆమె పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ మాట్లాడుతూ జిల్లాలో సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని సీ.ఎస్ దృష్టికి తెచ్చారు. పోడు పట్టాల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశామని, ఈ వారంలోగా పంపిణీ పూర్తి చేయనున్నట్టు తెలిపారు. హౌస్ సైట్ ప్లాట్స్ కు సంబంధించి లేఔట్స్ అయిపోయాయని, జిల్లా స్థాయి అప్రూవల్ , లబ్దిదారుల ఎంపిక పూర్తయిందని తెలిపారు.ఈ నెలాఖరులోగా పంపిణీ పూర్తి చేస్తామని సిఎస్‌కు తెలిపారు. గొర్రెల పంపిణీ ప్రక్రియ మొదలైందని, అదేవిధంగా బీసీలకు లక్ష రూపాయల ఆర్థిక సాయంకు సంబంధించి వచ్చిన దరఖాస్తులు అన్నింటి ఫిజికల్ వెరిఫికేషన్ పూర్తయిందని, ఆన్లైన్ వెరిఫికేషన్ రెండు రోజులలోగా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ వీరారెడ్డి ,సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



ఎమ్మెల్యే మదన్ రెడ్డి

నవ తెలంగాణ-నర్సాపూర్

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే మదన్ రెడ్డి అన్నారు. సోమవారం నర్సాపూర్ మండల పరిధిలోని తిరుమలాపూర్ గ్రామానికి చెందిన ఎల్లేష్‌కు సీఎం సహాయ నిధి కింద మంజూరైన రూ.60 వేల చెక్కును ఎమ్మెల్యే మదన్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ రెడ్డి మాట్లాడుతూ సీఎం సహాయనిధి పేద ప్రజల వైద్య ఖర్చుల నిమిత్తం ఎంతగానో ఉపయోగపడుతుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తిరుమలాపూర్ సర్పంచ్ కవిత రెడ్డి, శివంపేట మండలం బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రమణ గౌడ్, మాజీ అధ్యక్షులు పిట్ల సత్యనారాయణ ఉన్నారు.

రెవెన్యూ డివిజన్ సాధనకు అందరూ కలిసి రావాలి

జేఏసీ మండల కన్వీనర్ బొమ్మగాని అంజయ్య గౌడ్



నవతెలంగాణ-చేర్యాల: : చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేసే ఉద్యమంలో ప్రజలు అందరూ కలిసి రావాలని జేఏసీ చేర్యాల మండల కన్వీనర్ బొమ్మగాని అంజయ్య గౌడ్ పిలుపునిచ్చారు. మండలంలోని దొమ్మాట గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన కమిటీ సమావేశంలో అంజయ్య గౌడ్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పార్టీలకు అతీతంగా రెవెన్యూ డివిజన్ సాధన కోసం చేర్యాల ప్రాంత ప్రజలు రాజకీయ జెండాలు, ఎజెండాలను పక్కనపెట్టి కేవలం రెవెన్యూ డివిజన్ సాధన కోసమే ప్రతి ఒక్కరు కలిసి రావాల్సిన అవసరం ఉందన్నారు. అదే స్ఫూర్తితో గ్రామస్థాయిలో జేఏసీని విస్తరించడం కోసం కమిటీలు వేస్తున్నట్లు తెలిపారు. జేఏసీ దొమ్మాట గ్రామ కన్వీనర్ గా మంచర్ల మోహన్ రెడ్డి, కో కన్వీనర్ గా వెలుగుల కనకయ్య, కార్యదర్శిగా గుజ్జుల శ్రీనివాస్ రెడ్డి, ప్రతినిధులుగా పచ్చిమడ్ల రాజు, లింగాల కనకయ్య కొండపాక బాల నర్సు, గుజ్జుల తిరుపతిరెడ్డి, మంచర్ల తిరుపతిరెడ్డి, ఒగ్గు నరసింహులు, గుజ్జుల భరత్ రెడ్డి, గుజ్జుల వీరారెడ్డి,మేర్గోజు సీతారాములు తోపాటు 30 మందితో కమిటీని ఎన్నుకున్నారు.

నేటి నుంచి డ్రైవింగ్ లైసెన్స్ లకు దరఖాస్తులు

మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి

నవతెలంగాణ దుబ్బాక రూరల్



18 సంవత్సరాల వయస్సు నిండి డ్రైవింగ్ లైసెన్సు లేనటువంటి యువతి, యువకులకు ఉచిత డ్రైవింగ్ లైసెన్సు అందిస్తానని, నేటి నుండి దుబ్బాక ఎంపీ క్యాంపు కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరణ ఉంటుందని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలు, యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులు ఆధార్ కార్డ్, రెండు ఫోటోలు, జనన ధ్రువ పత్రం లేదా పదవ తరగతి మెమో తీసుకువచ్చి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. నేడు (ఈ నెల 4) మంగళవారం నుంచి 13 గురువారం సాయంత్రం 4 గంటలలోపు దుబ్బాక ఎంపీ క్యాంపు కార్యాలయంలో (దుబ్బాక బస్ డిపో దగ్గర) దరఖాస్తును సమర్పించాలని, లైసెన్స్ ఫీజు తానే చెల్లించి నియోజకవర్గ ప్రజలకు ఆర్టీవో కార్యాలయం నుంచి ఉచితంగా లైసెన్సులు మంజూరు చేయిస్తానని పేర్కొన్నారు.

యువతి ,యువకులకు ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్

నవతెలంగాణ-మర్కుక్



మండలంలోని 18 సంవత్సరాలు నిండిన యువతి ,యువకులకు మర్కుక్ బీఆర్ఎస్ పార్టీ అధ్వర్యంలో ఉచితంగా డ్రైవింగ్ లైసెన్సు ఇప్పించాలని, ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు , మంత్రి హరీశ్ రావు ఆదేశాల మేరకు నిర్ణయించటం జరిగిందని బీఆర్ఎస్ మర్కుక్ మండలాధ్యక్షులు మర్కుక్ కర్ణాకర్ రెడ్డి సోమవారం తెలిపారు. ఈ అవకాశాన్ని మండలంలోని యువతి ,యువకులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.యువతి యువకులు అందరు తమ తమ గ్రామాల్లోని బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులకుగాని , సర్పంచులకు గాని, ఎంపిటిసిలకు గాని, బీఆర్ఎస్ నాయకులను సంప్రదించగలరని సూచించారు.

కేసీఆర్ మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు



- ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మట్టి కరిపించడం ఖాయం
- పోలీసులు బీఆర్ఎస్ నాయకుల కోసం పనిచేస్తుండ్రు
- కాంగ్రెస్‌కు డిపాజిట్లు వచ్చే పరిస్థితి లేదు
- హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్

నవతెలంగాణ-మెదక్

సీఎం కేసీఆర్ జిత్తుల మారి నక్క అని, ఆయన మాటలు నమ్మే పరిస్థితుల్లో తెలంగాణ ప్రజలు లేరని హుజూరాబాద్ ఎమ్మెల్యే బీజేపీ రాష్ట్ర నాయకులు ఈటెల రాజేందర్ వ్యాఖ్యానించారు. సోమవారం మెదక్ పట్టణంలోని సాయి బాలాజీ గార్డెన్స్‌లో బీజేపీ ప్రవాస్ యోజన మహాజన సంపర్క్ అభియాన్ మెదక్ నియోజకవర్గ బహిరంగ సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారుడు కేసీఆర్ ను చూసి గర్వపడ్డ ప్రజలు, ఈ రోజు సీఎం మాటలకు, చేతలకు పొంతన లేదని అనుకుంటున్నట్లు తెలిపారు. ఉద్యమ సమయంలో కేసీఆర్‌ను ఏమైనా అంటే యువకులు, విద్యార్థులు విరుచుకుపడేవారని, ఇప్పుడు ఈ సీఎం మాకొద్దు అని అనుకుంటున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ సర్కారును ఓడిస్తామని ప్రజలు చర్చించుకుంటున్నట్లు వివరించారు. హుజూరాబాద్ ఎన్నికల్లో వచ్చిన గెలుపే రాష్ట్రంలోనూ ఉంటుందన్నారు. రాబోయే ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వాన్ని ప్రజలు మట్టి కల్పించడం ఖాయమని జోస్యం చెప్పారు. బీఆర్ఎస్ పార్టీతో ఎవరు కలిసినా ఆగమేనని చెప్పుకొచ్చారు. ఈ మూడేళ్లలో ఎక్కడ ఎన్నికలు జరిగినా ఎదుర్కొన్న పార్టీ బీజేపీ ఒక్కటే అని స్పష్టం చేశారు. దుబ్బాక, హుజూరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్ కూడా రాలేదని, ఇప్పుడు వాతావరణం మారలేదని ఎద్దేవ చేశారు. తెలంగాణ గడ్డపై మోడీ, అమిత్ షా, నడ్డ మాట్లాడిన మాటలు ప్రజలకు గుర్తున్నాయని తెలిపారు. దేశంలో రైతులను ఆదుకునే సర్కార్ తమదని పక్క రాష్ట్రాల్లో చెప్పిన కేసీఆర్ మొన్న కురిసిన వర్షాలకు నోటికాడి పంట మునిగితే పరిహారం రూ. 10 వేలు ఇస్తామని చెప్పి ఇవ్వలేదని తెలిపారు. తెలంగాణ పల్లెల్లో పోలీసులు లేకుండా ఊర్లలోకి వస్తే మీ బతుకులు ఎందో తెలుస్తాయని బీఆర్ఎస్ నాయకులకు సవాల్ విసిరారు. పేదలకు డబుల్ బెడ్రూం ఇల్లు ఇవ్వకపోవడంతో కిరాయి ఇళ్లలో ఉండే వాళ్ళు చనిపోతే రోడ్డు పై శవాన్ని వేసుకొని ఏడుస్తున్న పరిస్థితులు ఉన్నాయన్నారు. డబుల్, కాదు సింగిల్ బెడ్ రూం కూడా లేదన్నారు. పేదల సొంతింటి కల నెరవేరకుండా మట్టి కొట్టరన్నారు. ప్రజల సమస్యల పై ప్రశ్నిస్తే సీఎం కేసీఆర్ కు కోపమొచ్చి తనను పార్టీ నుంచి తీసేసినట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు తాళ్ళపల్లి రాజశేఖర్, నాయకులు నందా రెడ్డి, నల్లాల విజయ్, నాయిని ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఏపీజీవీబీ బ్యాంకు ఉద్యోగుల అలసత్వం బ్యాంకు సేవలు బంద్

తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఖాతాదారులు
ఖాతాదారులను బ్యాంకు మిత్ర వద్దకు పంపి చేతులు ఏత్తేస్తున్న సిబ్బంది
బ్యాంకు మిత్ర వద్ద తగిన సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నా వృద్ధులు, మహిళలు





నవతెలంగాణ-దౌల్తాబాద్

మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు ఉద్యోగుల అలసత్వం ఖాతాదారుల పాలిట శాపంగా మారింది. మండల పరిధిలోని గోవిందాపూర్, ఉప్పర్పల్లి,లింగరాజు పల్లి, కోనాయపల్లి, దీపాయంపల్లి, శేరిపల్లి బందారం, కోనాపూర్, మహమ్మద్ షాపూర్, ఇందుప్రియాల్ గ్రామాలకు చెందిన ప్రజలు ఈ బ్యాంకులో ఖాతాదారులుగా ఉన్నారు. ప్రతిరోజు కనీసం మూడు నుంచి ఐదు వందల మంది ఖాతాదారులు వస్తుంటారు. బ్యాంకు ఖాతాదారులకు బ్యాంకు లో అందించాల్సిన అన్ని సేవలను బ్యాంకు మిత్ర వద్దే చేసుకోవాలని బ్యాంకు ఉద్యోగులు ఖాతాదారులకు చెప్పి బ్యాంకు నుంచి బ్యాంకు మిత్ర వద్దకు పంపుతున్నారు. ఫలితంగా ఒక్క గ్రామానికే పరిమితమై సేవలందించాల్సిన బ్యాంకు మిత్ర పై భారం పడటంతో పాటు ఖాతాదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవడమే కాక సకాలంలో వారికి బ్యాంకు సేవలందడం లేదు. పెన్షన్,రైతు బంధు,వడ్ల పైసల కోసం వచ్చిన వారు రోజుల తరబడి తిరగాల్సి వస్తుంది. ఓపికతో ఉండి ఒక వేళ బ్యాంకు మిత్ర వద్ద డబ్బులు తీసుకుందాం అని నిరీక్షించినా నగదు విత్ డ్రా చేసాక నాలుగు ఐదు రోజులకు వచ్చి డబ్బులు తీసుకెళ్లాలని చెప్పడం విడ్డూరం కలిగించే విషయం. చూడాలి మరి బ్యాంకు ఉన్నత అధికారులు ఎప్పుడు స్పందించి ఖాతాదారులకు సకాలంలో సేవలు అందేలా చర్యలు తీసుకుంటారో.

ఘనంగా మెకానిక్స్ డే

నవ తెలంగాణ - సిద్దిపేట

ఫ్రెండ్స్ టు వీలర్ మెకానిక్ అసోసియేషన్ భవనంలో రాష్ట్ర అధ్యక్షులు తడిసిన వెంకట రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా మెకానిక్స్ డే జరుపుకోవడం జరిగింది ఫ్రెండ్స్ టు వీలర్ అధ్యక్షులు టి వెంకట్ రెడ్డి తెలిపారు. కేక్ కట్ చేసుకుని సంబరాలు చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సలహాదారులు భారీ మల్లేశం, సెక్రెటరీ ఎండి వాజిద్ బాబా, కార్యవర్గం, మెకానిక్ సభ్యులు పాల్గొన్నారు.



హుస్నాబాద్‌లో మెకానిక్‌ల బైక్ ర్యాలీ

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



ప్రపంచ మెకానిక్ డే సందర్భంగా సోమవారం హుస్నాబాద్ పట్టణం లో టూ వీలర్ మెకానిక్ లు బైక్ ర్యాలీ నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్ నుండి డిపో క్రాసింగ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో కేక్ కటింగ్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు ఉప్పుల వెంకట్, కర్ణకంటి నరేష్,శివ సాయి టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విద్యాధరి క్షేత్రంలో మూలా నక్షత్ర విశేష పూజలు

నవతెలంగాణ-వర్గల్



ప్రసిద్ధ వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రంలో సోమవారం మూలా నక్షత్ర విశేష పూజలు వైభవంగా జరిగాయి . ఆలయ వ్యవస్థాపక చైర్మన్ , బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర్ శర్మ సిద్ధాంతి ఉత్సవానికి అంకురార్పణ చేయగా , అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య శ్రీ విద్యాధరి అమ్మవారికి విశేష అభిషేకం, ప్రత్యేక పూజలు, అలంకరణ , చండీ హోమం తదితర కార్యక్రమాలు ఘనంగా జరిగాయి .